ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు
బుధవారం 24 సెప్టెంబరు 2025

'సోమశిల'కు తగ్గిన వరద



అనంతసాగరం సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల నుంచి సోమశిల జలాశయానికి వరద ప్రవాహం తగ్గుముఖం పట్టింది. సోమవారం 35,847 క్యూసెక్కులు వస్తుండగా మంగళవారం28,611 క్యూసెక్కులుగా నమోదైంది. డ్యాంలో 72.250 టీఎంసీలు నిల్వ ఉంది. ఇక మూడు గేట్ల ద్వారా 15,000, పవర్ టెన్నల్ ద్వారా 2,600, ఉత్తర కాలువకు 400, కండలేరుకు వరద కాలువ ద్వారా 10,450 క్యూసెక్కులు సరపరా చేస్తున్నారు.

'విజయ'లో డైరెక్టర్ స్థానాలు ఏకగ్రీవం

ఇద్దరు నామినేషన్ల ఉపసంహరణ

నెల్లూరు(వెంకటేశ్వరపురం), సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు జిల్లా పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సమితి(విజయ డెయిరీ)లో ఖాళీ అయిన మూడు డైరెక్టర్ స్థానాలకు ముగ్గురు అభ్యర్థులు ఏకగ్రీవం అయినట్లు ఎన్నికల అధికారి హరిబాబు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మూడు స్థానాల్లో రెండు మహిళా రిజర్వు స్థానాలు కావడంతో నామినేషన్లు దాఖలు చేసిన కొడవలూరు మండలం రేగడిచెలిక పాల సొసైటీ అధ్యక్షురాలు గుర్రం నాగేశ్వరమ్మ, బాలాయపల్లి మండలం వెంగమాంబాపురం సొసైటీ అధ్యక్షురాలు సూదలగుంట సాయినిరోషా ఏకగ్రీవం అయ్యారు. మిగిలిన జనరల్ పురుష స్థానానికి ముగ్గురు నామినేషన్ వేయగా వారిలో సంతదాసుపల్లి సొసైటీ సభ్యుడు ఇనుకుర్తి మల్లికార్జున నాయుడు, మైపాడు సొసైటీ సభ్యుడు కాకుటూరు చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం నామినేషన్ ఉపసంహరించుకున్నారు. దీంతో మిగిలిన అల్లూరు మండలం బీరంగుంట పాల సొసైటీ అధ్యక్షుడు పొంకం హరిబాబు ఏకగ్రీవం అయ్యారు. గెలుపొందిన ముగ్గురు డైరెక్టర్ల పదవీకాలం ఐదేళ్లని ఎన్నికల అధికారులు హరిబాబు,శివయ్య తెలిపారు.

అయిగిరి నందిని...



రాపూరు : పెంచలకోన క్షేత్రంలో ఆదిలక్ష్మి అవతారంలో అమ్మవారు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు జిల్లాలోని ఆలయాల్లో వైభవంగా జరుగుతున్నాయి. అమ్మవార్లు వివిధ అవతారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. విశేష అభిషేకాలు, పూజలు, హోమాలు జరిగాయి. ప్రధాన ఆలయాలకు భక్తులు పోటెత్తారు.



నెల్లూరులోని మూలస్థానేశ్వర స్వామి ఆలయంలో నృత్యం చేస్తున్న విద్యార్థిని

వివరాలు 6లో

ప్రపంచ శాస్త్రవేత్తల జాబితాలో వీఎస్‌యూ వీసీకి చోటు

- వివరాలు 6లో..

విద్యుత్ శాఖ.. బంపర్ ఆఫర్!

● అదనపు లోడ్ క్రమబద్ధీకరణకు 50 శాతం రాయితీ ● డిసెంబరు ఆఖరు వరకు గడువు



ఉదయగిరి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : గృహ వినియోగదారులకు విద్యుత్ శాఖ బంపర్ ఆఫర్ ఇచ్చింది. అదనపు లోడ్ క్రమబద్ధీకరణకు 50 శాతం రాయితీ ఇవ్వడంతోపాటు డిసెంబరు నెలాఖరు వరకు గడువు ఇచ్చింది. గృహాలకు విద్యుత్ కనెక్షన్ తీసుకునే సమయంలో లైట్లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువుల వినియోగాన్ని అంచనా వేసి లోడును కిలోవాట్లలో లెక్కించి సెక్యూరిటీ డిపాజిట్, డెవలప్‌మెంట్ చార్జీలు వసూలు చేస్తారు. జిల్లాలో సుమారు 8,99,151 గృహ విద్యుత్ కనెక్షన్లు ఉండగా, దాదాపు అన్నీ దశాబ్దాల క్రితం నాటివే. వాడే బల్బులు, ఫ్యాన్ల లెక్క ఆధారంగా వీటిని ఇచ్చారు. తరువాత ఎలక్ట్రానిక్ వస్తువుల వినియోగం బాగా పెరిగింది. అప్పట్లో విద్యుత్ వాడకం 0.5 కిలోవాట్ ఉంటే ఇప్పుడు అదే సర్వీసుపై 2 నుంచి 3 కిలోవాట్‌లు ఉంది. నిర్దేశిత మొత్తం చెల్లించి ఈ అదనపు లోడును క్రమబద్ధీకరించుకోవాల్సి ఉన్నా చాలా మంది చేసుకోలేదు. అధిక విద్యుత్ వాడుతున్నా తక్కువ సామర్థ్యానికే అనుమతి తీసుకుంటున్నారు. సాధారణ రోజుల్లో ఇబ్బంది లేకున్నా వేసవిలో వినియోగం పెరిగి ఆ భారం ట్రాన్స్‌ఫార్మర్లపై పడుతోంది. దీంతో తరచూ విద్యుత్ సమస్యలు తలెత్తుతాయి. ఇలాంటి పరిస్థితుల్లో సిబ్బంది తనిఖీల సమయంలో గుర్తిస్తే జరిమానా విధించి రూ.వేలల్లో అదనపు లోడు రుసుము వసూలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వినియోగదారులే స్వచ్ఛందంగా ముందుకొస్తే క్రమబద్ధీకరణ రుసుంలో 50 శాతం రాయితీ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.

రాయితీ ఇలా.. (రూ.లలో)

కిలోవాట్	అసలు	రాయితీ
1	2,250	1,250
2	4,450	2,450
3	6,650	3,650
4	8,850	4,850
5	11,050	6,050

రాపూరులో పొత్తపి చోళుల శిలాశాసనం

- వివరాలు 6లో..

ఏపీఎఫ్‌డీసీ ఆర్ఎంగా వివేక్

నెల్లూరు(వెంకటేశ్వరపురం) సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు జిల్లా ఏపీఎఫ్‌డీసీ (ఆంధ్రప్రదేశ్ ఫారెస్ట్ డవలప్‌మెంట్ కార్పొరేషన్) రీజనల్ మేనేజర్(ఆర్ఎం)గా ఐఎఫ్ఎస్ అధికారి వివేక్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. తిరుపతి డీఎఫ్‌వోగా ఉన్న ఆయనను నెల్లూరు ఆర్ఎంగా ఇటీవల ప్రభుత్వం బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బాధ్యతలు చేపట్టిన ఆయన కార్యాలయ ఉద్యోగులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్లాంటేషన్‌పై ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో నెల్లూరు డీఎం శారద, అధికారులు పాల్గొన్నారు.

ఎక్కడో ప్రాజెక్టు.. కావలిలో లోతట్టు!

కావలిలో భారీ భవంతులతో ఉన్న వెంగళరావు నగర్ ప్రాంతాన్ని రెవెన్యూ రికార్డులలో నక్కలగండి లోతట్టు ప్రాంతంగా రెవెన్యూ అధికారులు రికార్డుల్లో చూపారు. ఎక్కడో వరికుంటపాడు- పామూరు మధ్యలో ఉన్న నక్కలగండి ప్రాజెక్ట్ లోతట్టు ప్రాంతం (సుమారు 100 కి.మీ దూరం) కావలిలో ఉందంటూ రికార్డులలో ఎలా నమోదు చేశారో అధికారులకే తెలియాలి. ఒకవేళ తప్పుగా నమోదు చేసినప్పుడు దానిని వెంటనే సరిదిద్దాల్సిన బాధ్యత వారిపైనే ఉంది. కానీ రికార్డులు సరిచేయమని కాలనీవాసులు కాళ్లరిగేలా తిరుగుతన్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు.

వెంగళరావునగర్‌లో 2098 సర్వే నంబరులో 27 ఎకరాలకుపైన ఉండగా అందులో ఒక్క సెంటును మినహాయించి మిగిలిన భిన్నం మొత్తాన్ని 22 ఏ నుంచి తొలగించారు. అయితే ఆ ఒక్క సెంట్ మొత్తం భిన్నంలో ఉందని 27 ఎకరాలలో రిజిస్ట్రేషన్లు ఆపేశారు. దీంతో పిల్లల చదువులు, వివాహాలు తదితర అవసరాలకు ఆస్తులు అమ్ముకోవాలన్నా, బ్యాంకులో తనఖా పెట్టి రుణాలు తెచ్చుకోవాలన్నా ఇళ్ల యజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయితే రెవెన్యూ అధికారులు మాత్రం 2098 సర్వే నెంబరులో రోడ్లు, ఓపెన్ స్థలాలు కూడా ఉన్నందున ఆ భిన్నం మొత్తాన్ని సరిచేయాలని ఉన్నతాధికారులకు ఫైళ్లు పంపినట్లు చెబుతున్నారు. అయితే కలెక్టరేట్‌లో ఆ ఫైలు లేదని అక్కడి అధికారులు చెబుతుండటం ప్రజలను అయోమయానికి గురి చేస్తోంది.



కావలి పట్టణంలోని వెంగళరావునగర్ వ్యూ

● వరికుంటపాడు ప్రాంతంలో 'నక్కలగండి' జలాశయం
● లోతట్టు ప్రాంతంగా వెంగళరావు నగర్
● రెవెన్యూ రికార్డుల్లో తప్పుగా నమోదు
● సరిచేయాలని అధికారుల చుట్టూ ప్రజల అవస్థలు
● కలెక్టరేట్‌లో ఫైల్ ఉందంటున్నవైనం..(ఇక్కడ ఫైల్ అదృశ్యం
● దిక్కుతోచని స్థితిలో బాధితులు

కావలి పట్టణంలో 2048/బీ సర్వే నెంబరులో ఉన్న 300 ఎకరాల అటవీ భూమిని 1970 సంవత్సరంలో నివేశన స్థలాల కోసం గుర్తించి దానిని డీఫారెస్ట్ చేశారు. 1972లో వెంగళరావునగర్‌లో ఒక ప్రాంతంగా తుఫాన్‌నగర్‌ను గుర్తించి 110 ప్లాట్లకు పట్టాలు ఇచ్చారు. తిరిగి 1977లో వెంగళరావునగర్‌లో మార్కెట్ విలువ కింద అంకణం రూ.7 చొప్పున విశ్వోదయ హౌస్ బిల్డింగ్ సొసైటీకి, కృష్ణసింగ్ ఎన్‌జీవోస్‌కు పట్టాలు ఇచ్చారు. మిగిలిన ప్లాట్లకు 1987 వరకు పట్టాలు ఇస్తూ వచ్చారు. అయితే మార్కెట్ రేట్ ప్రకారం విక్రయించిన ప్లాట్లకు 2017, అక్టోబరు వరకు రిజిస్ట్రేషన్లు చేశారు. ఆ తర్వాత భూమి స్వభావంలో అడవి, నక్కలగండి లోతట్టు ప్రాంతంగా ఉందని పేర్కొంటూ వెంగళరావునగర్‌లో మొత్తం రిజిస్ట్రేషన్లు ఆపేశారు. ఆ తర్వాత స్థానికులు చేసిన పోరాటం ఫలితంగా 2048/బీ సర్వే నంబరును సబ్‌డివిజన్లు చేసి 2023, సెప్టెంబరులో 157.43 ఎకరాలను 22ఏ నుంచి తొలగించి రిజిస్ట్రేషన్లకు అవకాశం ఇచ్చారు. వాటిలో 20 ఏళ్ల దాటిన అసైన్ ప్లాట్లకు కూడా రిజిస్ట్రేషన్ అవకాశం కలిగింది. ఇంతవరకు బాగానే ఉంది. మిగిలిన దానిలో ప్రభుత్వ స్థలాలు, ప్రభుత్వ కార్యాలయాలకు కేటాయించిన ప్లాట్లు పోను 79 ఎకరాలలో ప్రజలు ఇళ్లు నిర్మించుకున్నారు. అయితే, ఆ 79 ఎకరాలలో ప్లాట్ల రిజిస్ట్రేషన్లు ఆగాయి. వాటిలో 2098, 2096 సర్వే నెంబర్లు రెవెన్యూ రికార్డులలో అనుభవ స్వభావం నక్కలగండి లోతట్టు ప్రాంతమని చూపిస్తుండగా, 2086/1 అనుభవ స్వభావం అడవి అని చూపిస్తోంది. నివాసలు ఉంటున్నా ఇంకా అధికారులు రికార్డులలో నక్కలగండి లోతట్టు ప్రాంతం, అడవి అని ఎలా చూపిస్తారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. 22ఏ నుంచి వాటిని తొలగించాలని అధికారులకు మొరపెట్టుకున్నా ఆ ఫైల్ నేటికి ఓ కొలిక్కి రాక పోవటంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు.

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)

కలెక్టరేట్‌కు ఫైలు పంపాం

వెంగళరావునగర్‌లో 22ఏలో ఉన్న ప్లాట్లను తొలగించమని కలెక్టరేట్‌కు ఫైల్ పంపాము. అయితే, 2098 సర్వే నెంబరులో ఒక్క సెంటు మినహా మిగతాది 22ఏ నుంచి తొలగించినట్లు రావటంతో దానిని మరలా వెరిఫికేషన్ చేసి అందులో ఉన్న ప్రైవేట్ ప్లాట్లనే తొలగించమని ఫైలు పంపాము. రెవెన్యూ రికార్డులు కంప్యూటరీకరణ చేసేటపుడు రెండు నెంబర్లు నక్కలగండి లోతట్టు ప్రాంతమని గతంలో నమోదు చేశారని కానీ 22ఏ నుంచి తొలగించేందుకు అది ఆటంకం కాదు.

- పీ.శ్రాణ్‌కుమార్, తహసీల్దార్, కావలి

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు **దరఖాస్తు గడువు పొడిగింపు**

6లో

దిగొచ్చిన మందులు

● భారీగా తగ్గిన ఔషధాల ధరలు
● ప్రాణాంతక మందులపై జీఎస్టీ ఎత్తివేత
● అందుబాటులో బీపీ, షుగర్ పరికరాలు
● వెంటనే అమలు చేయాలన్న ఔషధ నియంత్రణ శాఖ
● ఎక్కడైనా తగ్గింపు రేట్లకు అమ్మకపోతే చర్యలు

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : వస్తు సేవల పన్ను (జీఎస్టీ) ఎత్తి వేయటంతో ఔషదాల ధరలు భారీ తగ్గాయి. క్యాన్సర్, గుండె, లివర్‌తో సహా మానవ అవయవాల మార్పిడి, ఇతర ప్రాణాంతక వ్యాధులపై అవసరమైన 36 ఔషదాలపై జీఎస్టీ ఎత్తి వేయటంతో ధరలు తగ్గుముఖం పట్టాయి. కుటుంబ నియంత్రణకు ఉపయోగపడే గర్భనిరోధక మందులు, క్రిటికల్ కేర్‌కు ఉపయోగించే ఔషధాలు, శానిటరీ నాప్కిన్‌లు వంటి వాటిపై జీఎస్టీ ఎత్తివేశారు. అలాగే కొన్ని రకాల వ్యాధి నిరోధక టీకాలు, హెపటైటిస్ వ్యాధిని గుర్తించే వ్యాధి నిర్ధారణ కిట్‌లు, ఆర్థోపెడిక్ ఉపకరణాలు, వీల్ చైర్లు, ట్రైసైకిళ్లు, దివ్యాంగుల కోసం వినియోగించే పరికరాలు, గుండె వ్యాధుల్లో వినియోగించే స్టంట్‌లు, శిశువుల పాల ఉత్పత్తులతో పాటు బీపీ, షుగర్ పరికరాలు కొన్ని ఔషధాలపై గతంలో 12 శాతం ఉన్న పన్ను రేటు ఇప్పుడు 5 శాతానికి తగ్గించారు. తగ్గిన ధరలు ఈనెల 22 నుంచి అమలులోకి వచ్చాయి.



తగ్గిన ధరలు ఇలా.. (రూ.లలో)

మందులు	పాత	కొత్త
టిష్యూ ప్లాస్మినోజన్ ఏక్టివేటర్ 18 ఎంజీ (రక్తం గడ్డకట్టకుండా ఉండేందుకు)	47,510	44,540
టెస్టుజ్యూమాబ్ 150 ఎంజీ (క్యాన్సర్ వ్యాధికి ఉపయోగించే మందు)	42,871	40,191
ఆదలిమ్‌యుమాబ్ 40 ఎంజీ (వెన్నుముఖ, పేగుల్లో నొప్పికి)	26,620	25,956
టెనిక్టిపల్స్ 50 ఎంజీ వయల్స్ (గుండె వ్యాధుల నివారణకు)	63,355	59,395
డినోషమాబ్ 120 ఎంజీ వయల్ (ఎముకల బలహీనతకు)	41,726	39,118
గోలిముమాబ్ 100 ఎంజీ (టీబీ, ఫంగస్ ఇన్‌పెక్షన్)	54,700	51,281
రిలైసీయల్ కిట్ ఇంజక్షన్ (రక్తస్రావం అరికట్టేందుకు)	11,273	10.568

● ప్రతిరోజూ రూ.2 కోట్ల అమ్మకాలు

జిల్లా వ్యాప్తంగా 2500 ఔషధ దుకాణాలు ఉన్నాయి. ఇందులో హోల్‌సేల్ దుకాణలు 400 వరకు ఉన్నాయి. ఒక్క నెల్లూరు నగరంలోనే 800 ఔషధ దుకాణాలు ఉన్నాయి. ఇందులో 50కి పైగా కార్పొరేట్ ఆసుపత్రులకు సంబంధించి ఉన్న ఔషధ దుకాణాల్లో ప్రతిరోజూ రూ. 10 లక్షల వరకు అమ్మకాలు జరుగుతుంటాయి. ఇక జిల్లా వ్యాప్తంగా ఉన్న దుకాణాలతో కలిపి మొత్తం ప్రతి రోజూ రూ. 2 కోట్ల ఔషధాల రూపేణా వ్యాపారం జరుగుతుంటాయి. మొత్తం మీద జీఎస్టీ ఎత్తివేయటంతో ఔషధాల ధరలు రోగులకు మరింత అందుబాటులోకి వచ్చాయి.

● పాతరేటుకు అమ్మితే చర్యలు

జిల్లాలో తగ్గిన ఔషధాల ధరలు ప్రకారం తప్పక అమ్మాలని, ఎవరైనా ఇందుకు విరుద్ధంగా పాత రేటుకే అమ్మితే చర్యలు తీసుకుంటామని ఔషధ నియంత్రణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.

ఔషధ దుకాణాల తనిఖీ

ఔషధ దుకాణాల్లో తగ్గిన ధరల ప్రకారం అమ్మకాలు జరపాలి. అలా జరపని వారిపై చర్యలు తీసుకుంటాం. ప్రతి రోజూ ఆయా ఔషధ దుకాణాలకు పర్యవేక్షిస్తాం. ప్రత్యేకించి కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉన్న ఔషధ దుకాణాలపై ప్రత్యేక దృష్టి పెట్టి తనిఖీలు చేస్తాం.

- రమేష్‌రెడ్డి, ఔషధ నియంత్రణ శాఖ ఏడీ

వ్యాపారులను హెచ్చరించాం

జీఎస్టీ కొత్త నిబంధనల ప్రకారం ఔషధాలు అమ్మాలని వ్యాపారులను తెలియచేశాం. జీఎస్టీ ఎత్తి వేసిన మందులకు అనుగుణంగా అమ్మకాలు చేయాల్సి ఉంది.

- పేరూరి ప్రదీప్, జిల్లా కెమిస్ట్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ నాయకులు

మెగా డీఎస్సీ అభ్యర్థులు నేడు గొలగమూడికి రండి!

నెల్లూరు (విద్య-ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మెగా డీఎస్సీ-2025కి ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 25వ తేదీన అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా నియామక పత్రాలు అందచేస్తున్నట్లు డీఈఓ బాలాజీరావు ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి హాజరయ్యేందుకు అభ్యర్థులంతా 24న సాయంత్రం 4 గంటలకు వెంకటాచలం మండలం గొలగమూడి వెంకయ్యస్వామి ఆశ్రమం వద్ద హాజరు కావాలని పేర్కొన్నారు. ప్రతి అభ్యర్థి ఆధార్, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, కాల్ లెటర్, డీఎస్సీ హాల్‌టికెట్‌తోపాటు వ్యక్తిగత అవసరాలకు ఉపయోగించే వస్తువులతో హాజరు కావాలని తెలిపారు. 25న ఉదయం 6 గంటలకు విజయవాడకు బస్సు బయలుదేరుతుందని వెల్లడించారు.

హాస్టల్ విద్యార్థులకు ప్రాధాన్యమివ్వాలి

● వసతి గృహ సౌకర్యాల సమీక్షలో కలెక్టర్ శుక్లా

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రభుత్వ వసతి గృహాల్లోని విద్యార్థుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో వివిధ శాఖల సంక్షేమ వసతి గృహాల్లో సౌకర్యాలపై సమీక్ష జరిపారు. హాస్టల్ విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం, మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించాలని సూచించారు. క్రమం తప్పకుండా కంటి, దంత వైద్య పరీక్షలు చేయించాలని ఆదేశించారు. గిరిజనులకు ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు ఇప్పించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో ఐటీడీఏ పీవో మల్లికార్జునరెడ్డి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖల అధికారులు శోభారాణి, ప్రభావతి, వెంకటలక్ష్మి, హైఫా, మహ్మద్ ఆయూబ్ తదితరులు పాల్గొన్నారు.

ఆ రెండు లారీల్లో 90 టన్నుల రేషన్ బియ్యం

రూ.41.40 లక్షల సొత్తు స్వాధీనం

6ఏ తోపాటు ఇతర కేసుల నమోదుకు సిద్ధం

నెల్లూరురూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులో పట్టుబడిన ఐదు లారీల బియ్యం వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది. ఇవన్నీ రేషన్ బియ్యమంటూ అనుమానించిన పౌరసరఫరాల శాఖ వాటిల్లో నుంచి నమూనాలను సేకరించింది. వాటిని పరీక్షించగా అందులో రెండు లారీల్లోని బియ్యం రేషన్ సరుకుగా, మిగిలిన 3 లారీల్లోని బియ్యం సాధారణమైనవిగా తేల్చుతూ సోమవారం రాత్రి ఫలితాలు వచ్చాయి. దీంతో మంగళవారం ఉదయం పౌరసరఫరాల శాఖ అధికారులు రేషన్ బియ్యం ఉన్న రెండు లారీలను స్వాధీనం చేసుకున్నారు. నెల్లూరురూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో ఈ లారీలను ఉంచడంతో అక్కడకు వెళ్లిన ఏఎస్‌వో అంకయ్య, రూరల్ సీఎస్‌డీటీ జమీర్‌బాషాలు రెవెన్యూ అధికారుల సమక్షంలో స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 90 టన్నుల రేషన్ బియ్యం ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. వాటి విలువ రూ.41.40 లక్షలు వరకు ఉంటుందని లెక్కగట్టారు. సరుకు సరఫరాకు పాల్పడిన వ్యక్తులపై 6ఏతో పాటు మరిన్ని సెక్షన్ల కింద కేసు నమోదుకు పోలీసులకు సిఫార్సు చేయనున్నారు. జిల్లాలోని ఏ ఏ నియోజకవర్గాలలో ఈ రేషన్ బియ్యం సేకరించారన్నది లోతుగా దర్యాప్తుచేస్తున్న అధికారులు వీటిని నగర శివారు ప్రాంతంలో ఎందుకు ఉంచారన్నది ఆరా తీస్తున్నారు. ఈ లారీలు అనంతసాగరానికి చెందిన వ్యక్తివిగా అధికారులు అనుమానిస్తుండగా రేషన్ బియ్యం రాకెట్ వారి పాత్రపై దర్యాప్తు సాగుతుంది.



స్వాధీనం చేసుకున్న లారీలతో ఏఎస్‌వో, సీఎస్‌డీటీలు

● సాధారణ బియ్యంపైనా విచారణ

కాగ మిగిలిన మూడు లారీల్లోని సాధారణ బియ్యంపైనా పౌరసరఫరాల శాఖ అధికారులు విచారణ మొదలుపెట్టారు. లోడైన బియ్యానికి లెక్కలున్నాయా? ఉంటే వాటి రశీదులెక్కడ? ఎవరి దగ్గర కొనుగోలు చేశారు? ఎక్కడికి పంపుతున్నారు? అన్న కోణంలో విచారిస్తున్న అధికారులు నివేదిక తయారు చేసి జాయింట్ కలెక్టర్‌కు అందచేయనున్నారు. తదుపరి ఆయన ఉత్తర్వుల మేరకు తుది నిర్ణయం తీసుకుంటామని పౌరసరఫరాల శాఖ అధికారులు వెల్లడించారు.

జై భవానీ...!

వైభవంగా దేవీ నవరాత్రులు ● కనువిందు చేస్తున్న అమ్మవారి రూపాలు

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : దేవీ నవ రాత్రి ఉత్సవాలు జిల్లాలోని ఆలయాల్లో వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం రెండో రోజు అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులను కటాక్షించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చి పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశేష అభిషేకాలు, నవా వరణ పూజలు, సామూహిక కుంకుమార్చనలు, చండీ హోమాలు జరిగాయి. నెల్లూరులోని రాజరాజేశ్వరి అమ్మవారు భవానీగా దర్శనమిచ్చా రు. ఉదయం పంచామృతాభిషేకాలు, నవావరణ పూజలు జరిగాయి. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. స్టోన్‌హౌస్‌పేట కన్యకాపరమేశ్వరి ఆలయంలో భవానీ అలంకరణ, విశేష హోమాలు జరిగాయి. మూలవర్లకు కుబేర కుంకుమతో అలంకారం, సహస్ర దీపాలంకార సేవ భక్తులకు కనువిందు చేశాయి. కోలాట నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.



నెల్లూరు : అన్నపూర్ణగా ఇరుకళల పరమేశ్వరి



నెల్లూరు : భవాని అలంకరణలో రాజరాజేశ్వరి అమ్మవారు



బుచ్చిరెడ్డిపాళెం : జొన్నవాడలో త్రిపురాంబికాదేవి అలంకరణలో కామాక్షితాయి



నెల్లూరు : భవాని అలంకరణలో కన్యకాపరమేశ్వరి



నెల్లూరు : పెంచలకోనలోని విజయేశ్వరి ఆశ్రమంలో హోమం నిర్వహిస్తున్న విజయేశ్వరీదేవి





నెల్లూరులోని మూలస్థానేశ్వర స్వామి ఆలయంలో నృత్యం చేస్తున్న విద్యార్థినులు



నెల్లూరు : మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో భవానిగా భువనేశ్వరీ దేవి



కావలి : కాత్యాయనీ అలంకరణలో కలుగోళ శాంభవి

ప్రపంచ శాస్త్రవేత్తల జాబితాలో వీఎస్‌యూ వీసీకి చోటు

వరుసగా ఐదోసారి ప్రతిష్టాత్మక జాబితాలో ..

ఘనంగా సత్కరించిన బోధన, బోధనేతర సిబ్బంది

వెంకటాచలం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు మరో కీర్తి శిఖరాన్ని అధిరోహించారు. ప్రపంచ అగ్ర శాస్త్రవేత్తల జాబితాలో ఆయనకు చోటు దక్కింది. అమెరికాకు చెందిన ప్రతిష్టాత్మక స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ పరిశోధకులు రూపొందించిన ఈ జాబితాకు అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక స్థానం ఉంది. అసాధారణ ప్రతిభ కలిగిన శాస్త్రవేత్తలకే ఈ జాబితాలో చోటు దక్కుతుంది. ఐదేళ్లుగా విడుదల చేస్తున్న ఈ ప్రతిష్టాత్మకమైన జాబితాలో వరుసగా 5వసారి ఆయనకు చోటు లభించడం గర్వించదగ్గ విషయం. ఈసారి విక్రమ సింహపురి యూనివర్సిటీ నుండి తనకు ఈ గుర్తింపు దక్కడం సంతోషదాయకమని వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు ఆనందం వ్యక్తం చేశారు. భౌతిక శాస్త్రం, ఫోటానిక్స్ విభాగాల్లో ఆయన చేసిన పరిశోధనలు అంతర్జాతీయంగా ఎంతో గుర్తింపు పొందాయి. ఇప్పటివరకు ఆయన 270కి పైగా పరిశోధన పత్రాలు, పుస్తకాలు ప్రచురించారు. 25 మంది పరిశోధక విద్యార్థులకు మార్గదర్శకత్వం వహించారు. ఈ విశిష్ట గుర్తింపు వీఎస్‌యూ ప్రతిష్ఠను మరింత ఇనుమడింపజేస్తుందని వర్సిటీ అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. అవిశ్రాంత కృషి, నిబద్ధత వల్లే ఉపకులపతి శ్రీనివాసరావుకు ఈ గౌరవం లభించిందని వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత తెలిపారు. మంగళవారం వర్శిటీలో వీసీని బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు ఘనంగా సత్కరించారు.



వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావును సన్మానిస్తున్న వర్సిటీ అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు

పసికందు మృతిపై విచారణ

ఉదయగిరి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఉదయగిరి సామాజిక ఆరోగ్య కేంద్రంలో కాన్పు సమయంలో పసికందు మృతిపై మంగళవారం వైద్యాధికారుల బృందం సీహెచ్ కిరణ్, ఎం.బెట్టి బనాల్, ఆర్‌వీ హరితలు విచారణ చేపట్టారు. వారు మాట్లాడుతూ ఈనెల 20న సీతారామపురం మండలం బసినేనిపల్లి ఏసీనగర్ కాలనీకి చెందిన ముళ్లపాటి మంజుల కాన్పు కోసం వైద్యశాలకు వచ్చిందన్నారు. మంజులకు కాన్పు సమయంలో వైద్యుడి నిర్లక్ష్యం, అలసత్వం కారణంగానే పసికందు మృతి చెందాడని కుటుంబ సభ్యులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారన్నారు. అందులో భాగంగా డీసీహెచ్‌ఎస్ డాక్టర్ పరిమళ ఆదేశాల మేరకు విచారణ చేపడుతున్నామన్నారు. విచారణలో భాగంగా వైద్యులు, వైద్యసిబ్బంది, పారిశుధ్య కార్మికులతో పాటు బాధిత కుటుంబ సభ్యులను విచారించామన్నారు. విచారణలో గుర్తించిన అంశాలను నివేదిక రూపంలో ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. విచారణ సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి తన సిబ్బందితో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



వైద్యులను విచారిస్తున్న విచారణ వైద్యాధికారులు

శైవక్షేత్రానికి సైకిల్ యాత్ర



తమ గ్రామానికి 2,500 కిమీ దూరంలో ఉన్న ఆదియోగి క్షేత్రానికి ఓ వ్యక్తి సైకిల్ యాత్ర ప్రారంభించారు. వివరాలిలా ఉన్నాయి. పశ్చిమ బెంగాల్ రాష్ట్రం రాయ్ గంజ్ ప్రాంతానికి చెందిన అచిన్ తమిళనాడులోని కోయంబత్తూరు సమీపంలోని ఆదియోగి శైవక్షేత్రానికి సైకిల్‌పై బయలుదేరాడు. జాతీయరహదారిపై వెళ్తూ మంగళవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. ఈ నెల 4న తన స్వగ్రామమైన రాయ్‌గంజ్ నుంచి యాత్ర ప్రారంభించానన్నారు. ఆదియోగిలోని శివక్షేత్రాన్ని సందర్శించాలనే లక్ష్యంతో యాత్ర చేపట్టానన్నారు. కాగా యోగాకు మూలగురువైన ఆదిక్షేత్రాన్ని దర్శించేందుకు సైకిల్ యాత్ర చేస్తున్న అచిన్‌ను స్థానికులు అభినందించారు.

- కోవూరు (ఆంధ్రజ్యోతి)

సర్వేశాఖ ఏడీకి డీడీగా ఉద్యోగోన్నతి



నాగశేఖర్

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి) : జిల్లా సర్వే, ల్యాండ్ రికార్డుల శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా నాగశేఖర్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సర్వే శాఖలో పదోన్నతులలో భాగంగా నాగశేఖర్‌కు అసిస్టెంట్ డైరెక్టర్ నుంచి డిప్యూటీ డైరెక్టర్‌గా ఉద్యోగోన్నతి లభించింది. నెల్లూరులోనే ఏడీగా పనిచేస్తున్న ఆయనను డీడీగా ఇక్కడే నియమించడం విశేషం. ఆయనకు పలువురు అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తు గడువు పొడిగింపు

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు రూ.200 అపరాధ రుసుముతో అక్టోబరు 31వతేదీ వరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ గడువు పొడగిస్తున్నట్లు డీఈవో బాలాజీరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు apopen-s-c-hoo-l.a-p.-go-v.in వెబ్‌సైట్ ద్వారా వ్యక్తిగతంగాగానీ ఏపీ ఆన్‌లైన్ కేంద్రం, గ్రామవార్డు సచివాలయాల ద్వారా అయినా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు సమీపంలోని అధ్యయన కేంద్రంలో సంప్రదించాలని కోరారు.

ఎల్‌టీపీల సమస్యలు పరిష్కరిస్తాం

● నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి

నెల్లూరు (జడ్పీ), సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఎల్‌టీపీలు ఎదుర్కొనే సమస్యలను పరిష్కరించేందుకు నెల్లూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చిత్తశుద్ధితో పని చేస్తుందని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. నుడా కార్యాలయంలో మంగళవారం ఎల్‌టీపీలు, బిల్డర్స్‌తో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎల్ఆర్ఎస్ మీద అవగాహన కల్పించారు. ఎల్‌టీపీలు ఫీజ్ తగ్గించేలా కృషి చేస్తానన్నారు. ఎల్ఆర్ఎస్ విషయంలో చాలా మంది నిర్లక్ష్యంగా ఉన్నారని, అలాంటి వారికి భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నుడా సెక్రటరీ అల్లంపాటి పెంచల్‌రెడ్డి, పీవో హిమబిందు, కాలేషా, చంద్ర పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న నుడా చైర్మన్ శ్రీనివాసులురెడ్డి

పీఎఫ్ ఖాతాలు అప్‌డేట్ చేయాలి

నెల్లూరు(విద్య),(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలను అప్‌డేట్ చేసి పీఎఫ్ స్లిప్పులను ఆన్‌లైన్‌లో ఉంచాలని ఏపీటీఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు జడ్పీ కార్యాలయంలో మంగళవారం సీఈవో మోహన్‌రావుకు వినతిపత్రం అందించారు. కొన్నేళ్లుగా పీఎఫ్ స్లిప్పులు ఆన్‌లైన్‌లో ఉంచకపోవడంతో ఉద్యోగులు, ఉపాధ్యాయులు రుణాల విషయంలో ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఆరియర్స్, డిడక్షన్స్ సరిగ్గా జరుగుతున్నాయో లేదో కూడా తెలియడం లేదన్నారు. విశ్రాంత ఉపాధ్యాయుల పీఎఫ్ క్లోజర్స్‌ను ఆలస్యం చేయకుండా ఆడిటింగ్ చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సబ్‌కమిటీ సభ్యులు రియాజ్, కృష్ణారెడ్డి, జుల్ఫికర్ అలీ, జిల్లా అధ్యక్షుడు అల్లం సురేంద్రరెడ్డి పాల్గొన్నారు.

మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

నెల్లూరు(క్రైం),(ఆంధ్రజ్యోతి): ఇంటి అద్దె విషయం మాట్లాడుతున్నట్లు నటిస్తూ ఓ మహిళ మెడలోని బంగారు గొలుసును గుర్తుతెలియని దుండగుడు దోచుకెళ్లాడు. పోలీసుల కథనం మేరకు... నెల్లూరులోని చాకలివీధిలో లక్ష్మమ్మ ఒంటరిగా నివసిస్తోంది. ఆమె ఇంటి మిద్దె మీద వాటా అద్దెకు తీసుకునేందుకు సోమవారం సా యంత్రం ఓ వ్యక్తి వచ్చి మాట్లాడాడు. మంగళవారం అడ్వాన్స్ ఇస్తానని చెప్పి వెళ్లాడు. మంగళవారం ఉదయం 10.30 గంటలకు వచ్చి లక్ష్మమ్మతో మాట్లాడుతూ ఆకస్మత్తుగా ఆమె మెడలోని 12 గ్రాముల బం గారు సరుడును తెంపుకెళ్లాడు. బాధితురాలు చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు

కుల గణన చేశాకే 'స్థానిక' ఎన్నికలకు వెళ్లాలి

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర కులగణన చేసి, బీసీ రిజర్వేషన్లను వర్గీకరణ చేసిన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాం డ్ చేశారు. మంగళవారం నగరంలోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల వాగ్దానమైన బీసీల జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలు జరిపే ముందు సమగ్రంగా కులగణన చేయాలన్నారు. సంఘం జిల్లా అ ధ్యక్షుడు పలమాల శ్రీహరిరావు మాట్లాడు తూ బీసీ ఐక్యత దిశగా రాజకీయ పార్టీల నాయకులు కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ బొందిలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణసింగ్, రాము గౌడ్, కోటేశ్వరరావు, నాగసేనరావు, ప్రసాద్ గౌడ్, సుంకు వెంకటేశ్వర్లు, నర్మదా బాయి తదితరులు పాల్గొన్నారు.

నమ్మకంగా ఉంటూ దోచేశాడు..!

● నలుగురు నిందితుల అరెస్టు ● రూ.2.06 కోట్ల రికవరీ

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): వ్యాపారవేత్త వద్ద నమ్మకంగా ఉంటూ నగదు దోచేసిన డ్రైవర్, అతనికి సహకరించిన మరో ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.2.06 కోట్ల సొత్తు, మూడు కార్లు స్వాధీనం చేసుకున్నారు. నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో మంగళవారం నెల్లూరు నగర, రూరల్ డీఎస్పీలు పీ సింధుప్రియ, జీ శ్రీనివాసరావులు నిందితుల వివరాలను మీడియాకు వెల్లడించారు. నెల్లూరు రాంజీనగర్‌కు చెందిన వ్యాపారవేత్త కే కోదండరామిరెడ్డి బెంగళూరులో కన్‌స్ట్రక్షన్ కంపెనీ నిర్వహిస్తున్నారు. అయన వద్ద కర్ణాటక రాష్ట్రం మైసూరు జిల్లా సంజనగూడ తాలుక, హెల్లర్ గ్రామానికి చెందిన మహేష్ నాయక్ ఐదేళ్లుగా డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఎంతో నమ్మకంగా ఇంట్లో వాళ్లతో కలిసిపోయాడు. ఈ నెల 14న కోదండరామిరెడ్డి కంపెనీకి చెందిన రూ.2.10 కోట్ల నగదును డ్రైవర్‌కు ఇచ్చి కారులో పెట్టమని చెప్పాడు. ఇదే అదునుగా భావించిన డ్రైవర్ మహేష్ నాయక్ నగదు తీసుకొని పరారయ్యాడు. మైసూరు జిల్లాకు చెందిన రమేష్, బెంగళూరుకు చెందిన బసవరాజ్ భరత్ సహాయంతో తన స్వగ్రామానికి వెళ్లాడు. సహకరించిన వారికి రూ.10 లక్షల నగదు ఇచ్చాడు. మిగిలిన నగదును తన తండ్రి సోమానాయక్ సహాయంతో దాచి పెట్టాడు. బాధితుడు కోదండరామిరెడ్డి ఫిర్యాదు మేరకు నెల్లూరులోని బాలాజీ నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీసీఎస్, బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్లు అశోక్‌కుమార్, సాంబశివరావు తమ సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సాంకేతికత ఆధారంగా దర్యాప్తు చేశారు. మహేష్ నాయక్ పరారయ్యేందుకు సహకరించిన రమేష్, బసవరాజ్, భరత్‌ను ఈ నెల 18వ తేదీన అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.10 లక్షల నగదు, రెండు కార్లను స్వాధీనం చేసుకున్నారు. వారిచ్చిన సమాచారం మేరకు మహేష్ నాయక్, అతని తండ్రిని వారి స్వగ్రామంలోనే సోమవారం అరెస్ట్ చేసి వారి నుంచి రూ.1,96,29,000 నగదు, ఓ కారును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి సొత్తును రికవరీ చేయడంలో కృషి చేసిన ఇన్‌స్పెక్టర్లు అశోక్‌కుమార్, సాంబశివరావు, ఎస్ఐలు విజయ్‌శ్రీనివాస్, విశ్వనాథ్‌రెడ్డి, సిబ్బంది కేవీ సుధాకర్, సుబ్రహ్మణ్యం, భాస్కర్ తదితరులను ఎస్పీ అభినందించారు. వారికి రివార్డులు అందజేశారు.

'గాలికుంటు' టీకాలు తప్పనిసరి

నెల్లూరు(వ్యవసాయం), సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం ద్వారా ప్రభుత్వం గాలికుంటు వ్యాధి నివారణకు పశువులకు ఉచితంగా టీకాలు వేస్తోందని, పాడిరైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కే రమేష్ నాయక్ పిలుపునిచ్చారు. నెల్లూరులోని మన్సూర్‌నగర్‌లో మంగళవారం వెటర్నరీ పాలీ క్లినిక్(వీపీసీ) డిప్యూటీ డైరెక్టర్ టీ సోమయ్య ఆధ్వర్యంలో పశువులకు ఉచితంగా టీకాల కార్యక్ర మం జరిగింది. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి వల్ల పాల దిగుబడి తగ్గిపోతుందని, దూడల మరణాలు సంభవిస్తాయని, వ్యాధి రాకముందే జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నాలుగు నెలలు వయసు నిండిన పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలన్నారు. జిల్లాకు 5,18,000 డోసులు వచ్చాయని, జిల్లాలోని అన్ని పశువైద్య కేంద్రాలకు సరఫరా చేశామని చెప్పారు. ఇప్పటి వరకు 1,12,000 పశువులకు టీకాలు వేశామని, అక్టోబరు 21వతేదీ వరకు ఇది కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో లైవ్ స్టాక్ అసిస్టెంట్ శ్రీనివాసులు, వెటర్నరీ విద్యార్థి టీ లలిత, పాలిటెక్నిక్ విద్యార్థులు, పాడిరైతులు పాల్గొన్నారు.



గాలికుంటు వ్యాధి నివారణ టీకా వేస్తున్న జేడీ రమేష్‌నాయక్, పక్కన డీడీ సోమయ్య తదితరులు

పొత్తపి చోళుల శిలాశాసనం లభ్యం

● 12వ శతాబ్దం నాటిదిగా గుర్తింపు

రాపూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మునగాల వెంకటాపురం గ్రామ సమీపాన గల అటవీ ప్రాంతంలో 12వ శతాబ్దం నాటి శిలాశాసనం గుర్తించినట్లు జిల్లాకు చెందిన ప్రముఖ చరిత్రకారుడు షేక్.రసూల్ అహ్మద్ తెలిపారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు, ఈ ప్రాంతంలో కేంద్ర పురావస్తు అధికారుల బృందంతో కలిసి పర్యటించి, ఇక్కడ అటవీ ప్రాంతంలో దొరికిన చారిత్రక అవశేషాలను బట్టి తెలుస్తోందని ఆయన తెలిపారు. ఈ క్రమంలో రాతి శాసనాన్ని కనుగొన్నట్లు రసూల్ పేర్కొన్నారు. ఈ శాసనాన్ని గ్రామానికి ఉత్తరాన గల అటవీ ప్రాంతంలోని దేవళ్లదిబ్బ సమీపంలోని శిథిలమైన శివాలయ ప్రాంతంలో గుర్తించామని తెలిపారు. నాలుగు అడుగుల పొడవు, రెండు అడుగుల వెడల్పు గల గ్రానైట్ రాతిపై మూడు వైపులా చెక్కబడిన ఈ శాసనంలో పొత్తపి చోళుల పాలన కడప, చిత్తూరు, నెల్లూరు తదితర ప్రాంతాలకు విస్తరించినట్లుగా, అలాగే ఆయా ప్రాంతాలలో వివిధ ఆలయాలు నిర్మించినట్లుగా తెలుస్తోందని కేంద్ర ప్రభుత్వ పురావస్తు శాఖ చెన్నై శాసన విభాగ అధికారి డాక్టర్ ఎం.ఏసుబాబు విలేకరులకు తెలిపారు.



చోళుల నాటి శిలాశాసనంతో పురావస్తు శాఖ అధికారులు

కందుకూరులో అర్ధరాత్రి దౌర్జన్యం

జర్నలిస్టు స్థలం ఆక్రమణ

కందుకూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): కందుకూరులో అర్ధరాత్రి దౌర్జన్యం జరిగింది. పట్టణంలోని కోవూరు రోడ్డులో ప్రభుత్వం జర్నలిస్టులకు ఇచ్చిన స్థలాలలో స్థానిక అధికారపా ర్టీ నేతలు దురాక్రమణకు తెగబడ్డారు. 2000 లో కందుకూరులో ఉన్న వర్కింగ్ జర్నలిస్టులకు అప్పటి ఎమ్మెల్యే దివి శివరాం నివాసస్థల పట్టాలు మంజూరుచేశారు. జర్నలిస్టులు ఆ స్థలాలను అభివృద్ధి చేసుకోగా ఇటీవల కొందరు గృహాలు నిర్మించుకోగా, మరికొందరు చుట్టూ ప్రహరీలు ఏర్పాటు చేసుకున్నారు. ఈ స్థితిలో ఓ విలేకరి స్థలాన్ని సోమవారం అర్ధరా త్రి స్థానిక అధికార పార్టీ నాయకులు పువ్వాడి కోటయ్య, గోపి, మధు తదితరులు ప్రహరీగోడను కూల్చివేసి, స్థలాన్ని చదునుచేసి టెంట్‌లు వేసి హోమగుండం ఏర్పాటు చేశారు. ఈ విషయమై బాధిత విలేకరి తహసీల్దార్‌కు, పోలీసులకు ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ లావణ్య మాట్లాడుతూ జర్నలిస్టులకు చట్టబద్ధంగా జారీచేసిన పట్టాలుగా రికార్డులను పరిశీలించి నిర్ధారణకు వచ్చామని, తగుచర్యలు తీసుకుంటామన్నారు. సీఐ అన్వర్‌బాషా మాట్లాడుతూ రికార్డు లు పరిశీలించి బాధ్యులపై కఠినచర్యలు తీసుకుంటామన్నారు.



జర్నలిస్టు స్థలాన్ని ఆక్రమించి టెంట్‌లు వేసి హోమగుండం ఏర్పాటుచేసిన దృశ్యం

చర్యలు తీసుకోవాలి

కందుకూరులో జర్నలిస్టు స్థలాన్ని దురాక్రమణ చేసిన వైనంపై అధికారులు తక్షణం కఠినచర్యలు తీసుకోవాలని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	128
స్కిన్ చికెన్	230
స్కిన్‌లెస్	256

కోడిగుడ్ల ధర (100): 560

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.10794
వెండి కిలో ధర	రూ. 138400
వెండి ఒక గ్రాము	రూ.141.40

ఆంజనేయ ఆలయంలో ఆయుర్వేద వైద్య శిబిరం

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా నగరంలోని శ్రీ ధన్వంతరి కేరళ ఆయుర్ కేర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో రాయాజీవీధి వీరాంజనేయ దేవస్థానంలో మంగళవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యులు డాక్టర్ యస్ శ్రీవాత్సవ కుమార్, డాక్టర్ శ్రీకర్ భరద్వాజ్ పాల్గొని రోగులకు పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో అంజనేయస్వామి దేవస్థానం చైర్మన్ ఉమా సూరిశెట్టి, తిరుమల శెట్టి చంద్ర, రమాదేవి, జీవా తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం బాగలేదు : కమిషనర్

నెల్లూరు(సిటీ),సెప్టెంబరు 23,(ఆంధ్రజ్యోతి) : నగరంలో పారిశుధ్య నిర్వహణ తీరు బాగోలేదని కార్పొరేషన్ కమిషనర్ నందన్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆకస్మిక తనిఖీల్లో భాగంగా 29వ డివిజన్ మహాత్మాగాంధీ నగర్‌లో పర్యటించారు. ఆ ప్రాంతంలో పారిశుధ్య పనులపై పెదవి విరిచారు. బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు వేయకుండా చూడాలని, ప్రతీ ఇంటి నుంచి చెత్త సేకరించాలని సిబ్బందికి సూచించారు. డ్రైనేజీ కాలువల్లో పూడికతీత తరచూ చేపట్టాలన్నారు. అనంతరం రూరల్‌లోని కొండ్లపూడి ప్రాంతం వద్ద టిడ్కో గృహ సముదాయాన్ని పరిశీలించారు. ఇళ్ల స్థలాల లేఅవుట్లలో కనీస వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు. పలువురు ఆర్ఐలకు వివిధ అంశాలపై వివరణ కోరుతూ షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

నెల్లూరు రూరల్ ఎంపీడీవోగా రమణమ్మ



నెల్లూరు రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్ మండల అభివృద్ధి అధికారిగా ఎంవీ రమణమ్మ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రకాశం జిల్లా సంతనూతలపాడు మండలంలో డిప్యూటీ ఎంపీడీవోగా పని చేస్తున్న ఆమెకు ప్రభుత్వం ఉద్యోగోన్నతి కల్పించి నెల్లూరు రూరల్ ఎంపీడీవోగా బదిలీ చేసింది. ఆమెకు కార్యాలయ ఉద్యోగులు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు డయల్ యువర్ డీఎం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ నెల్లూరు డిపో పరిధిలోని ప్రయాణికుల సమస్యలు, సూచనలు, సలహాల స్వీకరణకు బుధవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నామని డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ప్రయాణికులు 9959225641 నెంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదులు, సలహాలు, సూచనలివ్వాలని కోరారు.

'నారాయణ' విద్యార్థులకు ఉద్యోగాలు

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : నారాయణ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు పలు సంస్థల్లో పెద్ద ఎత్తున ఉద్యోగావకాశాలు లభించాయని ఆ కళాశాల మేనేజ్‌మెంట్ కార్యదర్శి వినయ్‌కుమార్ తెలిపారు. నగరంలోని కళాశాలలో మంగళవారం జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రాంగణ ఎంపికల్లో హైదరాబాద్‌కు చెందిన ఐఫిల్ టెక్ సొల్యూషన్స్ సంస్థకు సివిల్, మెకానికల్ విద్యార్థులు 40 మంది ఎంపికయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ దత్తాత్రేయ శర్మ, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి, డీన్ డాక్టర్ విశ్వక్‌సేన్‌రెడ్డి, ప్రాంగణ ఎంపికల అధికారి సందీప్‌రెడ్డి, కిషోర్, సిబ్బంది పాల్గొన్నారు.

బ్రెయిన్ స్ట్రోక్‌పై అవగాహన

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని డీకే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం బ్రెయిన్‌స్ట్రోక్, ఎపిలెప్సీ మీద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ బిందు మీనన్ పాల్గొని బ్రెయిన్ స్ట్రోక్ లక్షణాలు, తక్షణ చర్యలను తెలియచేశారు. మనిషి ఒత్తిడికి గురికాకుండా ఎలా జీవించాలో వివరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రమణరావు, కోఆర్డినేటర్ డాక్టర్ టీ శ్రీరంజని, డాక్టర్ సీహెచ్ రమాదేవి, హెచ్ స్వాతి, డాక్టర్ ప్రియాంక, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● కార్యకర్తలను ఆదుకుంటాం : మంత్రి నారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నారాయణ

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి ఎంతో కృషి చేస్తోందని పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ వెల్లడించారు. నగరంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంగళవారం టీడీపీ శ్రేణులతో సమావేశమయ్యారు. నాయకులు, కార్యకర్తలను అన్ని విధాలా ఆదుకుంటామని తెలియచేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. క్షేత్ర స్థాయిలో పనిచేస్తేనే పదవులు వస్తాయని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావు, నాయకులు వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, తాళ్లపాక అనూరాధ, విజేతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్యానికి డబ్బివ్వలేదని ఆటో దహనం

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మద్యం తాగేందుకు నగదు ఇవ్వలేదన్న కోపంతో ఆటోను తగులబెట్టిన ఘటనలో ఇద్దరు నిందితులను మంగళవారం నవాబుపేట పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల వివరాలను నవాబుపేట ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి మీడియాకు తెలిపారు. మౌలానా సాహెబ్ వీధిలో ఆటోడ్రైవర్ వినయ్ అలియాస్ వెంకటేశ్వర్లు నివాసం ఉంటున్నాడు. అతని ఆటోను నెల్లూరు రూరల్ మండలం సుబహాన్‌నగర్‌కు చెందిన డేవిడ్ బాడుగకు తీసుకుని తిప్పుకునేవాడు. మనస్పర్థల నేపథ్యంలో వినయ్ డేవిడ్‌ను దూరంగా పెట్టాడు. ఈ నెల 21వ తేదీ రాత్రి వినయ్‌ను మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వాలని డేవిడ్, శెట్టిగుంటరోడ్డుకు చెందిన సతీష్ అడిగారు. అతను లేవని చెప్పడంతో సోమవారం తెల్లవారుజామున వినయ్ ఆటోపై పెట్రోలు పోసి నిప్పంటించారు. బాధితుడు నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు మంగళవారం నిందితులను అరెస్ట్ చేశారు.

మాం పాహి పరమేశ్వరి

● వైభవంగా నవరాత్రి ఉత్సవాలు





వేదగిరి క్షేత్రంలో ధాన్యలక్ష్మి

నవాబుపేట ధర్మరాజస్వామి ఆలయంలో గాయత్రీదేవి

నెల్లూరు (సాంస్కృతికం) సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని అమ్మవారి ఆలయాల్లో దేవీ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం అమ్మవార్లు వివిధ అలంకారాలలో భక్తులకు దర్శనమిచ్చారు. రాజరాజేశ్వరి అమ్మవారికి భవానీ అలంకరణ జరిగింది. టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పట్టు వస్త్రాలు సమర్పించారు. గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి అన్నపూర్ణాదేవిగా భక్తులను అనుగ్రహించారు. మూలస్థానేశ్వరాలయంలో భువనేశ్వరీ అమ్మవారికి భవానీ అలంకారం జరిగింది. వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో గోవిందమాంబ, గాయత్రీదేవి అమ్మవార్లు బాలత్రిపుర సుందరీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. మూలాపేట శ్రీకృష్ణధర్మరాజులస్వామి ఆలయంలో ద్రౌపదీ అమ్మవారికి మహాలక్ష్మీ అలంకారం, నవాబుపేట శ్రీకృష్ణ ధర్మరాజస్వామి ఆలయంలో ద్రౌపదీదేవి గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. బాలాజీనగర్‌లోని సీతారామమందిరంలో ధనలక్ష్మీ హోమం, సామూహిక సత్యనారాయణ వ్రతం జరిగాయి. సీతాదేవి బాలత్రిపుర సుందరీగా దర్శనమిచ్చారు.
కోదండరామపురం మహాలక్ష్మీ ఆలయంలో భవానీ అలంకారంలో అమ్మణ్ణి భక్తులకు దర్శనమిచ్చారు. ఉస్మాన్‌సాహెబ్‌పేట బాబాగిరిజన కాలనీలో మహాలక్ష్మీ అమ్మవారికి విశేష పూజలు, హోమాలు జరిగాయి. పప్పులవీధి మహాలక్ష్మీ ఆలయంలో వరలక్ష్మీ అలంకారం జరిగింది. పప్పులవీధి సిద్ధివిఘ్నేశ్వరాలయంలోని కామాక్షితాయి అమ్మవారికి శాకంబరీ స్వరూపిణీ బ్రహ్మచారి అలంకారం కనువిందు చేసింది. నగరంలోని అయ్యప్పగుడి గురువాయురప్పన్ మహావిష్ణువు ఆలయంలో ఆదిలక్ష్మికి ధనలక్ష్మీదేవి అలంకారం జరిగింది. వేదగిరి క్షేత్రంలో అమ్మవారిని ధాన్యలక్ష్మిగా ముస్తాబు చేశారు.

ప్రజారోగ్య సమస్యలు పరిష్కరించండి

కలెక్టర్‌కు జనసేన విజ్ఞప్తి

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కోరుతూ జనసేన పార్టీ జిల్లా నాయకులు మంగళవారం కలెక్టర్ హిమాన్షు శుక్లాకు కలెక్టరేట్‌లో వినతి పత్రం అందించారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ మాట్లాడుతూ క్యాన్సర్ పేషెంట్లకు గతంలో ఉచితంగా మందులు ఇచ్చేవారని, ప్రస్తుతం ఇవ్వడం లేదని ఆరోపించారు. వైద్య పరీక్షల నిమిత్తం జీజీహెచ్‌లో ఖరీదైన యంత్రాలున్నప్పటికీ నిర్వహణ లోపంతో అవి అందుబాటులో లేవన్నారు. జీజీహెచ్‌లో తాగునీటి సమస్య ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు మల్లికార్జున్ యాదవ్, జమీర్, ఈగి సురేష్ పాల్గొన్నారు.

ఎరుకల సమస్యలు పరిష్కరించండి

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఎరుకల కులస్తుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ ఎరుకల సేవా సంఘం కలెక్టర్ హిమాన్షు శుక్లాను కోరింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర కన్వీనర్ నల్లగొండ్ల శివ ఆధ్వర్యంలో నాయకులు మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిశారు. ఐటీడీఏ కార్యాలయంలో ఎరుకల కులస్తులను చిన్నచూపు చూస్తున్నారని ఆరోపించారు. వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని కోరారు.



కలెక్టర్‌కు జ్ఞాపిక అందజేస్తున్న జనసేన నాయకులు

కలెక్టర్‌ను కలిసిన ఏపీజీఈఏ నాయకులు

ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు మంగళవారం కలెక్టర్ హిమాన్షు శుక్లాను కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు బసిరెడ్డి సుధాకర్‌రెడ్డి, కోశాధికారి సురేష్, నెల్లూరు సిటీ యూనిట్ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, ఉపాధ్యక్షుడు శశికుమార్, వెంకటేశ్వర్లు, నెల్లూరు రూరల్ అధ్యక్షుడు శ్రీనివాసులు పాల్గొన్నారు.

'రెడ్‌క్రాస్' సభ్యుల భేటీ

నెల్లూరు (వైద్యం): కలెక్టర్ హిమాన్షు శుక్లాను మంగళవారం రెడ్‌క్రాస్ సొసైటీ పాలక మండలి సభ్యులు కలిశారు. అక్టోబరు 1వ తేదీన జరపాల్సిన జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవాన్ని అక్టోబరు 5వ తేదీన జరుపుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. దీనికి కలెక్టర్ అనుమతి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ పాలక మండలి సభ్యుడు మలిరెడ్డి కోటారెడ్డి, బ్లడ్‌బ్యాంక్ కన్వీనర్ అజయ్‌బాబు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ యశోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యశాఖకు కొత్త ఊపిరి పోశారు

● అసెంబ్లీలో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ నెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

ముత్తుకూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ పాలనలో వైద్యశాఖకు కొత్త ఊపిరి వచ్చిందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన అసెంబ్లీలో మాట్లాడుతూ వైద్య కళాశాలల విషయంలో మంత్రి సత్యకుమార్‌యాదవ్ ఇచ్చిన సమాధానం విన్న తర్వాత వైసీపీ నేతలు సిగ్గుతో తలదించుకోవాలన్నారు. సర్వేపల్లి నియోజకవర్గానికి ఒక డయాలసిస్ సెంటర్‌ను మంత్రి సత్యకుమార్‌యాదవ్ మంజూరు చేశారని తెలిపారు. ముత్తుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సామాజిక ఆరోగ్య కేంద్రంగా మార్చాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఇంటికో మహిళా వ్యాపారవేత్త

పొదలకూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఇంటికో మహిళా వ్యాపారవేత్తను తయారు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి అన్నారు. మంగళవారం మోడల్ గ్రామమైన మండలంలోని అయ్యగారిపాలెంలో 'మన డబ్బులు మన లెక్కలు' ప్రత్యేక యాప్‌పై గ్రూపు సభ్యులకు అవగాహన కల్పించారు. యాప్‌లో సంఘాలకు చెందిన వివరాలన్నీ అప్‌లోడ్ చేసి, సభ్యులకు చెందిన ప్రత్యేక ఐడీతో నమోదయ్యేలా చూస్తారన్నారు. పాస్‌వర్డ్ సహాయంతో ఎప్పటికప్పుడు వివరాలు చూసుకోవచ్చునన్నారు. బ్యాంకు లింకేజీ, ముద్ర రుణాలు, పీఎం సూర్యఘర్, పీఎం ఈజీపీ, ఎస్ఈపీ తదితర కార్యక్రమాలను వివరించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ డీపీఎం మురళీ, ఏపీఎం చిన్నయ్య, సర్పంచ్ కండే వసంతమ్మ, వెలుగు సీసీలు, వీఓఏలు, పొదుపు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

స్థలం ఆక్రమణను అడ్డుకున్న గ్రామస్థులు

మనుబోలు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని మడమనూరు గ్రామంలో ఓ స్థలం ఆక్రమణను మంగళవారం గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ కొద్ది సంవత్సరాలుగా ఆ స్థలంలో చర్చి నడుపుతున్నారన్నారు. దాని పరిసరాల్లో ఉన్న స్థలంలోని చెట్లను గ్రామానికి చెందిన అధికారపార్టీ నాయకులు తొలగించారు. తరువాత దానిని ఆక్రమించి, అందులో గొలుసుదుకాణం పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. దీనిపై అధికారులు స్పందించి చర్చి స్థలాన్ని కాపాడాలని గ్రామస్తులు కోరారు.

ముఖ్యమంత్రి ఫొటో బహూకరణ

కొడవలూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : స్థానిక తహసీల్దారు కార్యాలయంలో టీడీపీ నాయకులు కోవూరు వెంకీ తహసీల్దారు స్ఫూర్తిరెడ్డికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చిత్రపటాన్ని బహూకరించారు. చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

అసెంబ్లీలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



సీఎంకు వినతిపత్రం ఇస్తున్న ప్రశాంతిరెడ్డి

కోవూరు, సెప్టెంబరు 23, (ఆంధ్రజ్యోతి): పేద, మధ్య తరగతి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మంగళవారం అసెంబ్లీలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కోవూరు కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌ను 100 పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్దాలని కోరారు. కోవూరు, బుచ్చిరెడ్డిపాళెం పీహెచ్‌సీ సెంటర్లలో డయాలసిస్ సెంటర్లను ఏర్పాటు చేయాలన్నారు. కోవూరు, బుచ్చిరెడ్డిపాళెం, కొడవలూరుల్లో భవనాల మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలన్నారు.

నెల్లూరు (హరనాథపురం) : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మంగళవారం అమరావతిలోని క్యాంపు కార్యాలయంలో కలిశారు. కోవూరు నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు.

ఆరోగ్య కార్డుల పంపిణీ

ఇందుకూరుపేట : కొత్తూరు గిరి జన సంఘం, రావూరు డొంక గిరిజన కాలనీలో మంగళవారం మండలాధ్యక్షుడు కైలాసం శ్రీనివాసులు రెడ్డి పర్యవేక్షణలో గిరిజనులకు ఉచిత ఆరోగ్య గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. బీజేపీ నాయకులు శివ ప్రసాద్, మహేష్, శరత్, కిష్టయ్యపాల్గొన్నారు.

మకర తోరణం బహూకరణ



మకర తోరణం అందిస్తున్న శ్రీవల్లి

పొదలకూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఆర్యవైశ్య ప్రముఖుడు, వ్యాపారవేత్త తన్నీరు మోహన్‌రావు జ్ఞాపకార్థం ఆయన సతీమణి శ్రీవల్లిదేవి శరన్నవ రాత్రుల సందర్భంగా శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం మూలవిరాట్టుకు రూ. 15 లక్షల విలువైన 14 కేజీల వెండి నూతన మకర తోరణాన్ని మంగళవారం దేవస్థానం కమిటీ సభ్యులకు అందజేశారు. అధ్యక్షుడు వాకాటి రాఘవేంద్ర రావు, ఉపాధ్యక్షుడు జొన్నలగడ్డ బ్రహ్మయ్య, పొట్టి సుధాకర్, కార్యదర్శి తన్నీరు సురేష్, కుమార్, రాజా, సురేంద్ర బాబు, గుర్రం మీరా మధు, వీరప్రకాశం, ధనుంజయ రావు, పాల్గొన్నారు.

28న నష్టపరిహారం పంపిణీ

మనుబోలు,సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఈనెల 28న సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆర్‌వోబి లబ్దిదారులకు భూ నష్టపరిహారం చెక్కులు పంపిణీ చేయనున్నారని నెల్లూరు ఆర్డీవో నాగ సంతోష అనూష మంగళవారం తెలిపారు. ఆమె స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆర్‌వోబికి సంబంధించి రికార్డులు పరిశీలించారు. నష్టపరిహారం రూ. 1.13 కోట్లు చెక్కుల రూపంలో ఆదివారం ఇవ్వబోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ. అరుణ్‌కుమార్, విఆర్‌వో వెంకయ్య, సర్వేయర్ అనురూప్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి సంక్షేమ విభాగం డీన్‌గా డాక్టర్ ప్రభాకర్

వెంకటాచలం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ)లో విద్యార్థి సంక్షేమ విభాగం డీన్‌గా ఆంగ్లశాఖ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్ ప్రభాకర్ నియమితులయ్యారు. ఈమేరకు వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు మంగళవారం ప్రభాకర్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, ప్రొఫెసర్ హనుమారెడ్డి, డాక్టర్ సుజయ్‌కుమార్, పీఆర్‌ఓ డాక్టర్ నీలమణికంఠ తదితరులు ఆయనకు అభినందనలు తెలిపారు.

త్రిపురాంబిక అలంకారంలో కామాక్షితాయి

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు 23, (ఆంధ్రజ్యోతి): జొన్నవాడ శ్రీ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మంగళవారం కామాక్షితాయి త్రిపురాంబికాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. గంగవరం గ్రామానికి చెందిన శింగారెడ్డి లక్ష్మీనరసారెడ్డి దంపతులు ఉభయ దాతలుగా వ్యవహరించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ ఈఓ అర్వభూమి వెంకట శ్రీనివాసులు రెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు. పెద్దూరులో కోదండ రామస్వామి ఆలయంలో కోదండరాముడు శ్రీ మహావిష్ణువు అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

ఆక్వా లైసెన్సులకు ఎకరాకు రూ. వెయ్యి చెల్లించాలి

మనుబోలు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): రొయ్యలు, చేపల గుంతలు సాగు చేస్తున్న ఆక్వారైతులు ఎకరాకు రూ. వెయ్యి చెల్లించితే లైసెన్సులు మంజూరు చేస్తారని, ఆ లైసెన్సులు ఉంటేనే ప్రభుత్వం కల్పించబోతున్న విద్యుత్ రాయితీ వర్తిస్తుందని మత్స్యశాఖ అభివృద్ధి అధికారి సంజయ్ స్టీఫెన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ఆక్వా రైతులకు విద్యుత్ రాయితీ కల్పించాలని నిర్ణయం తీసుకుందన్నారు. అక్టోబరు 20 లోగా సచివాలయంలో పత్రాలు సమర్పించాలన్నారు.

ఉరివేసుకుని యువతి ఆత్మహత్య

వెంకటాచలం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సకాలంలో వైద్య సేవలు అందించి ఉంటే ఒక యువతి బ్రతికి ఉండేది. కానీ వైద్యులు అందుబాటులో లేకపోవడంతో వారి నిర్లక్ష్యానికి యువతి ప్రాణాలను కోల్పోయింది. మండలంలోని కసుమూరు పంచాయతీ అనకాడి వడ్డీపాళెం గ్రామానికి చెందిన మల్లి శీనయ్య, సుబ్బమ్మల కుమార్తె మల్లి పూర్ణ 23కు వచ్చే నెల 8వ తేదీన వివాహం జరగనుంది. అయితే పూర్ణ గొలగమూడి క్రాస్ రోడ్డు సమీపంలోని ఓ ఫ్యాక్టరీలో పని చేస్తుండగా మంగళవారం రాత్రి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. కుటుంబ సభ్యులు వెంటనే పూర్ణను ఆటోలో వెంకటాచలంలోని సామాజిక వైద్య ఆరోగ్య కేంద్రానికి (సీహెచ్‌సీ) తరలించారు. ఆ సమయంలో ఒక నర్సు తప్ప వైద్యులు అందుబాటులో లేరు. దాదాపు గంటయినా వైద్యులు రాకపోవడంతో చివరకు కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న ఆ యువతిని తీసుకుని 108 వాహనంలో నెల్లూరు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లుగా నిర్ధారించారు. బంధువులు సీహెచ్‌సీకి చేరుకోగా కొద్దిసేపటి తర్వాత సీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ పరుశురాం తన కారులో వచ్చారు. విషయం తెలియగానే సీఐ సుబ్బారావు సిబ్బందితో కలిసి సీహెచ్‌సీ వద్దకు చేరుకున్నారు. యువతి బంధువులు మెడికల్ ఆఫీసర్‌తో గొడవకు దిగారు. తమ బిడ్డను తీసుకుని వచ్చే సమయానికి ఆసుపత్రిలో వైద్యులు అందుబాటులో ఉండి ఉంటే తమ బిడ్డ బతికి ఉండేదన్నారు. వైద్యుల నిర్లక్ష్యంతోనే తమ బిడ్డను కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే పూర్ణ ఆత్మ హత్య ఎందుకు చేసుకుందో తమకు అర్థం కావడంలేదని కన్నీరుమున్నీరయ్యారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	128
స్కిన్ చికెన్	230
స్కిన్‌లెస్	256

కోడిగుడ్ల ధర (100) : 560

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.10,794
వెండి కిలో ధర	రూ. 1,38,400
వెండి ఒక గ్రాము	రూ.141.40

కావలిలో ప్రత్యేక ఆధార్ క్యాంపులు

కావలి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న బయోమెట్రిక్ అప్‌డేట్స్ పూర్తి చేసేందుకు కావలి పట్టణంలోని 4 సచివాలయాలలో ఈనెల 23 నుంచి 26 వరకు ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు కావలి మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని బొమ్మారెడ్డివారి వీధి, వైకుంఠపురం, వెంగళరావునగర్, కలుగోళమ్మపేట సచివాలయాలలో ఏర్పాటు చేసిన ఈ ఆధార్ క్యాంపులను పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

న్యూస్ బాక్స్

కుళ్లిన కోడి గుడ్లపై విచారణ

వలేటివారిపాలెం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలినేనిచెరువు అం గన్‌వాడీ కేంద్రలో కుళ్లిన గుడ్లు అని ఆంధ్రజ్యోతిలో మంగళవారం ప్రచురితమైన కథనానికి ఐసీడీఎస్ సీడీపీఓ ఉషా రాణి ఆదేశాల మేరకు సూపర్‌వైజర్ సునీత తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలోని గుడ్లతో పాటు పిల్లలను, రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం గరుకుపాలెం, చుండి మాలకొండ గ్రామాల్లో ని అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె తనిఖీ చేసి గుడ్లను తూకం వేశారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ సునీత మాట్లాడుతూ చిన్నసైజు గుడ్లు, కుళ్లిన గుడ్లపై ఉన్నతాదికారుల ద్వారా కాంట్రాక్టర్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఆమె తెలిపారు.

రోడ్డు ఆక్రమించి గోడ నిర్మించారని ఫిర్యాదు

కావలిరూరల్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజువారి చింతలపాలెంలో రోడ్డు ను ఆక్రమించి మసీదు గోడ నిర్మాణం చేపడుతున్నారని మంగళవారం తహసీల్దారు శ్రావణ్‌కుమార్‌కు రైతులు ఫిర్యాదు చేశారు. గ్రామంలోని సుమారు 200 ఎకరాల మాగాణి భూములకు, చెరువుకు వెళ్లే దారిని ఆక్రమించి మసీదు గోడ నిర్మాణం చేపడుతున్నారని, దారి వదులి కట్టుకోవాలని సూచించినా అందుకు నిరాకరిస్తూన్నారన్నారు. అక్రమంగా కడుతున్న గోడ నిర్మాణాన్ని అడ్డుకుని న్యాయం చెయ్యాలని స్థానిక రైతులు ప్రసాద్, మల్లికార్జున, హరి, మాలకొండయ్య తదితరులు వినతిపత్రం అందించేశారు. గ్రామానికి వచ్చి కట్టడాలను పరిశీలిస్తానని తహసీల్దారు హామీ ఇచ్చారు.

'స్వస్త్ నారీ స్వశక్త్'

చిట్రగుంట, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం జువ్వలదిన్నెలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం స్వస్త్ నారీ స్వశక్త్ పరివార్ అబియాన్ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ వైద్యులు నిత్యప్రశాంతి, హెల్త్ సూపర్‌వైజర్ వసంత, గ్రామ సర్పంచు మామిడి అంకమ్మ, అంగన్వాడీ సూపర్‌వైజర్ హైమావతి పాల్గొన్నారు.

● **అల్లూరు :** అల్లూరులో నిర్వహించిన స్వస్థ నారీ స్వశక్త్ పరివార్ అబియాన్ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, వైద్యులు పాల్గొని మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎంపీడీవో రజనీకాంత్, కమిషనర్ ఉమామహేశ్వరరావు, పలగాటి శ్రీనివాసులురెడ్డి, బండి శ్రీనివాసుల రెడ్డి, అనురాధ, విజయకుమార్, కార్తీక్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు


కావలి(టౌన్) : బ్రహ్మచారిణిగా దుర్గాభ్రమరాంబ


కలిగిరి : గాయత్రీదేవి అలంకారంలో భద్రకాళి


చిట్రగుంట : గాయత్రీదేవిగా రాజరాజేశ్వరి దేవి

కావలి(టౌన్), సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): దేవి నవ రాత్రోత్సవాలు రెండవ రోజు మంగళవారం వైభవంగా జరిగాయి. గ్రామదేవత కలుగోళశాంభవి కాత్యాయనీదేవిగా భక్తులకు దర్శనమిచ్చి రాత్రి సర్వభూపాల వాహన సేవలందుకున్నారు. శివాలయంలోని దుర్గాభ్రమరాంబ బ్రహ్మచారిణిగా, కొత్తబజారులోని వాసవీ కన్యకాపరమేశ్వరి గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణంలో మహిళా భక్తుల కోలాటం ఆకట్టుకుంది. విష్ణాలయంలో రాజ్యలక్ష్మి ఆదిలక్ష్మీగా, వడ్డిపాలెంలోని కనకదుర్గా బాల త్రిపురసుందరీ దేవిగా దర్శనమిచ్చారు.

● **గాయత్రీదేవిగా భద్రకాళి**

కలిగిరి: దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా మండలంలోని తెల్లపాడులో వెలసి ఉన్న భద్రకాళి భక్తులకు గాయత్రీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. అమ్మవారికి జరిగిన కుంకుమార్చన పూజా కార్యక్రమంలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉమ్మడిశెట్టి శేషయ్యా-లావణ్య, నాగభూషణం-లక్ష్మి, నాగేశ్వరరావు- చెంచమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

● **వెండి పంచలోహ పాత్రల బహూకరణ**

భద్రకాళికి గ్రామానికి చెందిన మామిళ్లపల్లి వెంకటేశ్వరరావు, రాజ్యలక్ష్మి దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారుడు, కోడలు బాలాజీబాబు, సౌదామిని దంపతులు రూ.లక్ష ఖరీదైన వెండి పంచ లోహపాత్రలు అందజేశారు. దాతలను దేవస్థానం కమిటీ సభ్యులు ఆలయ మర్యాదలతో సత్కరించి వేదపండితులచే ఆశీర్వచనం చేయించారు.

● **గాయత్రీదేవిగా రాజరాజేశ్వరిదేవి**

చిట్రగుంట : బోగోలు మండలం విశ్వనాథరావుపేటలోని రాజరాజేశ్వరిదేవి గాయత్రీదేవిగా భక్తులకు దరనమిచ్చారు. బోగోలు సాయిబాబా మందిరం, రామస్వామిపాలెం, చెన్నారెడ్డిపాలెం తదితర ప్రాంతాల్లో నవరాత్రికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● **నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం**

కొండాపురం : మండలంలోని సాయిపేట పంచాయతీల మక్కెనవారిపాలెంలోని గంగమ్మ ఆలయంలో దసరా నవరాత్రి ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజున అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి తీర్థప్రసాదాలను అర్చకులు భక్తులకు అందచేశారు.

భారత్‌ను ముందంజలో నిలపడమే మోదీ లక్ష్యం


కంటి పరీక్ష చేయించుకుంటున్న బీజేపీ నేత భరత్‌కుమార్

చిట్రగుంట, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): అన్ని రంగాల్లో భారత్‌ను ముందంజలో ఉంచడమే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రధాన లక్ష్యం అని బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు జీ.భరత్‌కుమార్, జిల్లా కోశాధికారి సీవీసీ సత్యం అన్నా రు. మోదీ జన్మదిన వేడుకల్లో భాగంగా బోగోలు మండలం జువ్వలదిన్నె సచివాలయంలో బీజేపీ మండల అధ్యక్షులు వీరాల శ్రీనివాసులు యాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. నెల్లూరు జయభారతి ఆసుపత్రి వైద్యబృందం రోగులకు పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు నూకసాని శ్రీనివాసులు యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి బీ.మాల్యాద్రి, నాయకులు ఎస్.రాజ్యలక్ష్మి, జీ.వెంకటేశ్వర్లు, కే.కొండయ్య, ఏ.అరుణ్‌కుమార్, అంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఆసుపత్రిలో నర్సుపై హిజ్రాల దాడి

కందుకూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): కందుకూరు పట్టణంలో హిజ్రాలు రెచ్చిపోతున్నారు. వ్యాపారులు, నివాస గృహాలు, పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాల వద్దకు వెళ్లి దౌర్జన్యంగా డబ్బులు వసూలు చేయడం పరిపాటిగా మారింది. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి పట్టణంలోని బస్టాండ్ సెంటర్‌లో ఉన్న హరిణి ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లి పెద్ద మొత్తంలో డబ్బు డిమాండ్ చేశారు. ఇదేమని ప్రశ్నించినందుకు ఆసుపత్రిలో నర్సుపై మూకుమ్మడిగా దాడికి పాల్పడి విచాక్షణా రహితంగా కొట్టి గాయపరిచారు. ఈ వ్యవహారం అంతా సీసీ కెమెరాల్లో రికార్డయింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిన్నారులకు మున్సిపల్ కమిషనర్ సత్కారం


చిన్నారులను సత్కరించిన మున్సిపల్ కమిషనర్ అనూష

కందుకూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): శాస్త్రీయ నృత్య ప్రదర్శనలో ఉత్తమ ప్రతిభ కనపరిచి ప్రపంచ రికార్డుల్లో స్థానం దక్కించుకున్న చిన్నారులను మున్సిపల్ కమిషనర్ అనూష మంగళవారం తన కార్యాయంలో ఘనంగా సత్కరించారు. స్థానిక కనిగిరి రోడ్డులోని శ్రీనటరాజ నాట్యమండలి, సరస్వతి నిలయంకు చెందిన నాట్య గరువులు తిరుమల శెట్టి వెంకట దత్తేశ్వరి, ప్రేమ్‌కుమార్ శిష్య బృందం గత ఏడాది డిసెంబర్‌లో జరిగిన అంతర్జాతీయ శాస్త్రీయ సంగీత, నృత్య సంఘం నిర్వహించిన శివతాండంలోని రావణఘట్టంలో పాల్గొని వివిధ ప్రపంచ రికార్డుల్లో పేరు లిఖించుకున్నారు. ఉపాధ్యాయ దినోత్సవం రోజున హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన నృత్య ప్రదర్శనలో అత్యుత్తమ ప్రదర్శనతో రైసింగ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డును అందుకున్నారు. ఉగాది జాతీయ పురస్కారాలు అందుకునన చిన్నారుల ప్రతిభను గుర్తించిన మున్సిపల్ కమిషనర్ అనూష వారిని శాలువాతో ఘనంగా సత్కరించి అభినందించారు.

పీ4 కార్యక్రమంపై శిక్షణ

వలేటివారిపాలెం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం గ్రామ సచివాలయ ఉద్యోగులకు పంచాయతీ కార్యదర్శులు చంద్రశేఖర్, కృపారావులు పీ4 పథకంపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్‌రావు, ఈవోఆర్డీ నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపిన సీఎం

కావలి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు ఉద్యోగాలలో 3 శాతం రిజర్వేషన్ కల్పించి వారి జీవితాల్లో సీఎం చంద్రబాబునాయుడు వెలుగులు నింపారని పారా స్పోర్ట్స్ కమిటీ జిల్లా అధ్యక్షుడు టీసీ మాల్యాద్రి నాయుడు తెలిపారు. కావలి జర్నలిస్ట్‌క్లబ్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉపాధ్యాయ నియామకాల్లో పారా స్పోర్ట్స్ మెరిట్ కోటాలో 15 మంది దివ్యాంగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. ఆయన వెంట స్వచ్ఛంద సంస్థల గౌరవ అధ్యక్షుడు షేక్ ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

పోర్టు పనులను పరిశీలించడం దేశద్రోహమా?

గుడ్లూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): రామాయపట్నం పోర్టు నిర్మాణ పనులు పరిశీలన దేశద్రోహమా అని వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం వైసీపీ శ్రేణులతో కలసి పోర్టు వద్దకు వెళుతున్న గోవర్ధన్‌రెడ్డిని, కందుకూరు ఇన్‌చార్జీ బుర్రా మధుసూదన్ యాదవ్‌ను, గుడ్లూరు, కందుకూరు పోలీసుల చేవూరు దగ్గర అడ్డుకున్నారు. దీనితో పోలీసుల తీరుపై కాకాణి మండిపడ్డారు. వైసీపీ నేతలు కే.కృష్ణ, ఎన్.వెంకటేశ్వరరెడ్డి, ఆర్.బ్రహ్మానందం, తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం


అంకురార్పణ పూజల్లో అర్చకులు

కావలి(టౌన్), సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): బృందావనం కాలనీలో వెలసివున్న వేంకటేశ్వర స్వామి నవరాత్రి బ్రహ్మోత్సవాలు మంగళవారం రాత్రి మేధావి పూజ అంకురార్పణతో వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ వ్యవస్థాపక కమిటీ అధ్యక్షుడు శ్రీరామ్ మాల్యాద్రి పర్యవేక్షణలో అక్టోబరు 3వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. బుధవారం ధ్వజారోహణ జరగనుంది.

పుల్లారెడ్డినగర్‌లో బార్ పెడితే ఊరుకోం

కావలి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పుల్లారెడ్డినగర్‌లో జనవాసాల మధ్య బార్ అండ్ రెస్టారెంట్ ఏర్పాటును ఉపసంహరించుకోవాలని ఉమెన్ ఫోర్స్ కన్వీనర్ చాకలికొండ శారద, డాక్టర్ కల్పన, హరీష్‌లు పేర్కొన్నారు. కావలి జర్నలిస్ట్‌క్లబ్‌లో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ పుల్లారెడ్డినగర్ ప్రశాంతమైన నివాస ప్రాతమన్నారు. అక్కడ బార్‌అండ్ రెస్టారెంట్ ఏర్పాటు చేస్తే శాంతిభద్రతలకు విఘాతకం కలుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, ఆర్డీవో సన్నీ వంశీకృష్ణల దృష్టికి తీసుకెళ్లినా అధికారులు పట్టించుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు పద్మ, సునీత, నరసమ్మ, స్థానికులు కృష్ణారావు, సుబ్బారెడ్డి, సుధాకర్, గోపి పాల్గొన్నారు.

పొగాకుకు ప్రత్యామ్నాయంపై దృష్టి సారించాలి

కందుకూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి) : పొగాకు పంటకు ప్రత్యామ్నాయ పంటలపై రైతులు దృష్టి సారించాలని ఎన్‌బీఆర్‌సీఏ శాస్త్రవేత్త డాక్టర్ గంగాధర్ సూచించారు. కందుకూరు-2 పొగాకు బోర్డు వేలం కేంద్రంలో ఒంగోలు ప్రాంతీయ కార్యాలయ ఆధ్వర్యంలో కందుకూరు-1, 2 వేలం కేంద్రాల పొగాకు రైతులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. మిరప, పత్తి, శనగ, కంది, మినుము, పెసర, మొక్కజొన్న, ప్రొద్దుతిరుగుడు, నువ్వులు, జనుము వంటి పంటలు సాగు చేసుకోవచ్చన్నారు. వేలం నిర్వహణ అధికారి చంద్రశేఖర్ మాట్లాడారు. కార్యక్రమంలో ఏవో గీతా ప్రకాష్, హార్టికల్చర్ కాలేజీ డీన్ విజయభాస్కర్, సత్యశ్రీనివాస్, రాజ్‌గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అధ్యక్షా..

ఉదయగిరి-నందవరం రహదారి నిర్మాణం చేపట్టాలి


అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

ఉదయగిరి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): నియోజవర్గంలో 29 కిలోమీటర్ల మేర అధ్వానంగా ఉన్న ఉదయగిరి-నందవరం రహదారి నిర్మాణం చేపట్టాలని మంగళవారం అసెంబ్లీలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ విన్నవించారు. ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాల్లో ఈ రహదారి విస్తరించి ఉందన్నారు. జిల్లా కేంద్రమైన నెల్లూరుకు వెళ్లే ఈ రహదారి 50 ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోలేదన్నారు. మోకాటిలోతు గుంతలు, సింగిల్‌రోడ్డుతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ మార్గంలో డబుల్‌రోడ్డు ఏర్పాటు చేస్తే ఈ ప్రాంత ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని, ఆ దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని రోడ్లుభవనాల శాఖా మంత్రి జనార్దన్‌కు ఆయన విజ్ఞప్తి చేశారు.

తూనికలు, కొలతల శాఖ అధికారుల తనిఖీ

వింజమూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలో కావలికా చెందిన తూనికల కొలతల శాఖ అధికారి మోషన్ బృందం మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ప్రధాన రహదారి వెంబడి ఉన్న షాపుల్లో తనిఖీలు నిర్వహించి జరిమానాలు విధించారు. ఈ విషయం తెలుసుకున్న పలువురు దుకాణదారులు దుకాణాలు మూసివేశారు. ఈ సందర్భంగా అధికారి మోషన్ మాట్లాడుతూ కొత్త జీఎస్టీ నిబంధన ప్రకారం సరుకులను విక్రయించాలని, కచ్చితమైన కొలతలు, తూకం ఉండాలని, నూతన విధి విధానాలతో సరుకులు విక్రయించాలన్నారు. లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మాజీ ఎమ్మెల్యేకి సన్మానం

సంగం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్రిపాడుకి చెందిన మందిపాటి అజయ్‌కుమార్‌రెడ్డి వైసీపీ విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డిని అజయ్‌కుమార్ రెడ్డి శాలువాతో సత్కరించారు.

బాలాత్రిపుర సుందరి అలంకారంలో జ్వాలాముఖి అమ్మవారు


ఉదయగిరిలో గాయత్రీదేవి అలంకరణలో పార్వతీదేవి


దుత్తలూరు మండలం గుదేవారిపాళెంలో గాయత్రీదేవిగా రేణుకాఎల్లమ్మ


సీతారామపురం : రాజరాజేశ్వరి దేవి అలంకారంలో వాసవీ కన్యకా పరమేశ్వరి


వరికుంటపాడు : తూర్పురొంపిదొడ్లలో బ్రహ్మచారిణి అలంకరణలో మానసాదేవి

ఆత్మకూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఉత్తర బలిజ వీధిలో వెలసిన శ్రీ జ్వాలాముఖి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం జ్వాలాముఖి అమ్మవారు బాలాత్రిపుర సుందరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

మర్రిపాడు: శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా మర్రిపాడు మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో మంగళవారం గాయత్రి దేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు అభిషేకం చేసి, భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ ఏడాది పదకొండు రోజులు పదకొండు అవతారాలతో అమ్మవారిని అలంకరించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

సంగం : స్థానిక సంగమేశ్వరాలయంలో జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి శ్రీ కామాక్షిదేవి గాయత్రీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి పల్లకీసేవ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి నున్నా వెంకటేశ్వర గుప్త, వెంకట సుజన దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. స్థానిక తిరుమనత్పిలో వెలసిన శ్రీ రాజరాజేశ్వరీదేవి సమేత కాశీ విశ్వేశ్వరస్వామి జ్ఞానపీఠంలో పీఠాధిపతి రాజరాజేశ్వరానందస్వామి ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల మూలవిరాట్‌లకు క్షీర, పంచామృతాలు, సకల ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించారు.

సీతారామపురం : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజు వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి, గ్రామ దేవత అంకాలమ్మ, నారాయణమ్మపేటలో విజయ కనక దుర్గదేవి, ఘటిక సిద్దేశ్వరం క్షేత్రంలోని ఇష్టకామేశ్వరీదేవిలు రాజరాజేశ్వరి దేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. అమ్మణ్ణులకు పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు.

ఉదయగిరి : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజైన మంగళవారం అమ్మవార్లు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా పట్టణంలోని పార్వతీ పరమేశ్వర, బాలాజీనగర్, సంతానలక్ష్మీ ఆలయాల్లో అమ్మవారు భక్తులకు గాయత్రీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవార్లను దర్శించి కాయాకర్పూరం అందజేసి మొక్కులు తీర్చుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

దుత్తలూరు : మండలంలోని నర్రవాడ పంచాయతీ గుదేవారిపాళెంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండోరోజు రేణుకాఎల్లమ్మ తల్లి గాయత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని కాయాకర్పూరం అందజేసి మొక్కులు తీర్చుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్): దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మండలంలోని తూర్పురొంపిదొడ్ల గ్రామంలో వెలసి ఉన్న మానసాదేవి బ్రహ్మచారిణి, వరికుంటపాడులో నాగారప్పమ్మ గాయత్రీదేవి అలంకరణల్లో భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలతోపాటు కుంకుమార్చన, సహస్రదీపాలంకరణ, అభిషేకాలు చేపట్టారు. ఆయా ఆలయాలకు భక్తులు అధికసంఖ్యలో చేరుకోవడంతో అర్చకులు గోత్రనామాలతో ప్రత్యేక పూజలు చేపట్టారు.

సీతారామపురం : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజు వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి, గ్రామ దేవత అంకాలమ్మ, నారాయణమ్మపేటలో విజయ కనక దుర్గదేవి, ఘటిక సిద్దేశ్వరం క్షేత్రంలోని ఇష్టకామేశ్వరీదేవిలు రాజరాజేశ్వరి దేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. అమ్మణ్ణులకు పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చన, సహస్ర దీపాకాలంకరణ, అర్చన అభిషేకాలు నిర్వహించి వేద పండితులు అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. అంకాలమ్మ గుడి వద్ద అన్నదానం చేశారు.

ఏఎస్‌పేట : స్థానిక కృష్ణమందిరంలో శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా రెండవ మత్యన్యకా పరమేశ్వరి అమ్మవారిని సరస్వతి అలంకారంలో ముస్తాబు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని అమ్మ వారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు

చిరమనలో 'స్వస్త్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్'

ఏఎస్‌పేట, 3(ఆంధ్రజ్యోతి): చిరమనలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం 'స్వస్థ్ నారీ- స్వశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమన్ని బీజేపీ నాయకులు కే వేంకటేశ్వర్లు ప్రారంభించారు. మహిళలు, పిల్లల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రధాని నరేంద్రమోదీ ఈ పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు.

చెత్త నుంచి సంపద సృష్టే లక్ష్యం : జడ్పీ సీఈవో

సంగం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చెత్త నుంచి సంపద సృష్టే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు జెడ్పీ సీఈవో మోహన్‌రావు పేర్కొన్నారు. మంగళవారం ఆయన మండలంలోని మక్తాపురంలోని చెత్త సంపద కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ తడి, పొడి చెత్త వేరు చేసి తొట్టేల్లో వానపాములు వేసి ఎరువు తయారు చేసే విధానాన్ని పరిశీలించారు. పంచాయతీ రికార్డులు తనిఖీ చేసి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పన్నులను వంద శాతం వసూలు చేయాలని సెక్రటరీని ఆదేశించారు. నిత్యం ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్తను సేకరించి చెత్త సంపద కేంద్రానికి తరలించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో రఘురామయ్య, ఇన్‌చార్జి డిప్యూటీ ఎంపీడీవో నరసయ్య, సెక్రటరీ అరుణ తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరిని జిల్లా చేయాలని వినతి



ఉదయగిరి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): చారిత్రక నేపథ్యం కలిగి అనాదిగా అభివృద్ధికి నోచుకోని ఉదయగిరిని జిల్లా చేయాలని మంగళవారం తహసీల్దారు ఎల్.రామ్మోహన్‌కు నాయిబ్రాహ్మణలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాగు, తాగునీరు, సరైన వైద్య, విద్యా అవసరాలు లేక ఈ ప్రాంత ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ ప్రాంతం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలంటే జిల్లా చేయడం ఒక్కటే మార్గమన్నారు. అందులో భాగంగా నెల్లూరు, ప్రకాశం, కడప జిల్లాల్లోని 21 మెట్ట మండలాలను కలిపి ఉదయగిరి కేంద్రంగా జిల్లా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయిబ్రాహ్మణ సంఘ నాయకులు వీ.ప్రసాద్, ఎం.శ్రీనివాసులు, జీ.నారాయణ, శీను తదితరులు పాల్గొన్నారు.

కుర్చీల వితరణ

ఉదయగిరి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్ ట్రెజరీ కార్యాలయానికి విశ్రాంత ఉద్యోగ, ఉపాధ్యాయుల సంఘం ఉదయగిరి తాలుకా అధ్యక్షుడు షేక్ ఖాదర్‌బాషా కుర్చీల వితరణ చేశారు. కార్యాలయానికి అధికంగా విశ్రాంత ఉద్యోగులు వస్తుండడం, ఫర్నిచర్ కొరత ఉండడంతో కుర్చీలను వితరణ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా కుర్చీలను సబ్ ట్రెజరీ అధికారి ఉస్మాన్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలని కార్మికుల ఆందోళన

ఉదయగిరి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులు వేతనాలు చెల్లించాలని మంగళవారం వైద్యశాల ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు పారిశుధ్య కార్మికులు మాట్లాడుతూ నాలుగు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో కుటుంబ పోషణ భారమైందన్నారు. విధులకు హాజరయ్యేందుకు చార్జీలకు సైతం నగదు లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. అరకొరగా ఇచ్చే వేతనాలు సైతం నెలల తరబడి చెల్లించకపోవడంతో కుటుంబ పోషణకు, వడ్డీలకు అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు వేతనాలు చెల్లించి ఆదుకోవాలని వారు కోరారు.

నేలటూరులో వైద్య శిబిరం

ఉదయగిరి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేలటూరులో మంగళవారం స్వస్త్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గండిపాళెం పీహెచ్‌సీ వైద్యాధికారి శివకల్పన ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వివిధ రుగ్మతలతో బాధపడుతున్న 70 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గన్నేపల్లి సర్పంచు నెల్లూరు వెంకటస్వామి, వైద్యఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నియామక పత్రాల పంపిణీ


ఉదయగిరి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఉదయగిరి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల ఆయా పోస్టులకు ఇటీవల నిర్వహించిన ఇంటర్వ్యూలో ఎంపికైన అభ్యర్థులకు నియామకపత్రాలు అందజేసినట్లు సీడీపీవో పుణ్యవతి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రాజెక్టు పరిధిలోని సీతారామపురం, ఉదయగిరి, వరికుంటపాడు మండలాల్లో ఖాళీగా ఉన్న తొమ్మిది ఆయా పోస్టులకు ఈనెల 9, 11వ తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహించామన్నారు. వారిలో ఎంపికైన వారికి నియామకపత్రాలు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ షాను, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైద్యశాల తనిఖీ

దుత్తలూరు(ఉదయగిరి), సెప్టెంబరు 23(ఆంధ్రరజ్యోతి): మండలంలోని నర్రవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం తహసీల్దారు వై.నాగరాజు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్యశాలలో రోగులకు అందుతున్న సేవలను పరిశీలించడంతోపాటు వార్డు, మందుల గదిని, సంబంధిత రికార్డులను తనిఖీ చేశారు. వైద్యశాలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి మనోజ్ఞ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతు కార్డుల లక్ష్యాన్ని అధిగమించాలి

ఉదయగిరి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలానికి కేటాయించిన కౌలురైతు కార్డుల లక్ష్యాన్ని అధిగమించాలని తహసీల్దారు ఎల్.రామ్మోహన్, మండల వ్యవసాయాధికారి విజయభాస్కర్‌లు సూచించారు. మంగళవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో వీఆర్వోలు, వీఏఏలు, వీహెచ్‌ఏలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో కౌలు రైతులను గుర్తించి వీఆర్వోల వద్దకు ధ్రువపత్రాలతో పంపినట్లయితే కౌలురైతు కార్డులు జారీ చేస్తారన్నారు. అర్హులైన రైతులందరికీ కౌలుకార్డులు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే ఈ-పంట నమోదు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

తిరుపతి
జిల్లా వార్తలు
బుధవారం 24 సెప్టెంబరు 2025

తిరుమలేశుడికి బ్రహ్మోండోత్సవం

నేటి నుంచి ప్రారంభంకానున్న వాహన సేవలు

పుష్ప, విద్యుత్ అలంకరణలతో ముస్తాబైన కొండ




శ్రీవారి ఆలయం ముందు..


శ్రీవారి ఆలయం లోపల అలంకరణ

తిరుమల, సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి): తొమ్మిది రోజులపాటు తిరుమలేశుడికి జరిగే బ్రహ్మోండోత్సవానికి టీటీడీ అంతా సిద్ధం చేసింది. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని టీటీడీ దాదాపు రూ.25 కోట్లతో ఏర్పాట్లను చేపట్టింది. పుష్ప, విద్యుద్దీపాలంకరణలతో తిరుమల కొండ భక్తులకు కనువిందు చేస్తోంది. మంగళవారం అంకురార్పణ ఘట్టంతోనే తిరుమలకు బ్రహ్మోత్సవ శోభ సంతరించుకుంది. బుధవారం సాయంత్రం 5.43 నుంచి 6.15 గంటల వరకు మీనలగ్నంలో ధ్వజారోహణం నిర్వహించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున సీఎం చంద్రబాబు నాయుడు శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు. ఇక, రాత్రి 9 నుంచి 11 గంటల వరకు పెద్దశేషవాహన సేవ జరగనుంది. దీంతో ఆలయ నాలుగు మాడవీధుల్లో వాహనసేవలు మొదలు కానున్నాయి. ప్రతి రోజు ఉదయం 8 నుంచి 10 వరకు, రాత్రి 7 నుంచి 9 గంటల వరకు దేవేరులతో కలిసి మలయప్పస్వామి వివిధ వాహనాలపై మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించనున్నారు. 28వ తేదీన గరుడవాహనం మాత్రం సాయంత్రం 6.30 గంటలకే మొదలుకానుంది.

మెరిసిపోతున్న కొండ

ఈఏడాది రూ.5.30 కోట్లతో అలిపిరి గరుడ సర్కిల్ నుంచి శ్రీవారి ఆలయం వరకు విద్యుద్దీపాలంకరణ చేపట్టారు. శ్రీవారి ఆలయంతో పాటు జీఎన్సీ టోల్‌గేట్ నుంచి ఆర్టీసీ బస్టాండ్, వైకుంఠం క్యూకాంప్లెక్స్, మాడవీధులు, అన్నప్రసాదభవనం, ఆస్థానమండపం, రాంభగీచ, లడ్డూకౌంటర్ వంటి ప్రధాన ప్రాంతాలతో పాటు రోడ్లుకు ఇరువైపులా, పార్కులు, వాటర్ ఫౌంటెన్లు, ప్రధాన కూడళ్లలో ఎల్ఈడీ, పార్కాన్ లైట్లతో ప్రత్యేకంగా అలంకరణలు చేశారు.

మనసుదోచే పుష్పాలంకరణ

ఏటా 8 నుంచి 10 టన్నుల పుష్పాలతో అలంకరణ చేపట్టేవారు. ఈసారి ఎక్కువమంది దాతలు ముందుకు రావడంతో 6 టన్నులతో శ్రీవారి ఆలయంలోపల, మరో 12 టన్నులతో వెలుపల.. మొత్తం 18 టన్నుల సంప్రదాయ పుష్పాలతో స్వామి క్షేత్రాన్ని ముస్తాబు చేశారు. లక్ష కట్‌ఫ్లవర్స్‌లో ఆలయంలోని ధ్వజస్తంభం ప్రాంతాన్ని తీర్చిదిద్దారు. గరుడసేవ ముందు రోజు, మహారథం ముందురోజు ఈ పుష్పాలంకరణలను మార్చనున్నారు. ఈఏడాది ప్రత్యేకంగా వైకుంఠం క్యూకాంప్లెక్స్1, జీఎన్సీ టోల్ గేట్ వద్ద పుష్పాలంకరణలు చేశారు.

కంకణ భట్టాచార్యుడిగా వేణుగోపాల దీక్షితులు

ఏటా బ్రహ్మోత్సవాల్లో అర్చకుల్లో ఒక్కరిని కంకణ భట్టాచార్యులుగా నియమిస్తారు. ఈ క్రమంలోనే పూర్వం బ్రహ్మోత్సవాలతో పాటు వసంతోత్సవాలు వంటి కైంకర్యాలను విజయవంతంగా నిర్వహించి, శ్రీవారి ఆలయంలో ప్రధాన అర్చకుడిగా వ్యవహరిస్తున్న వేణుగోపాల దీక్షితులను ఈఏడాది ఎంపిక చేశారు. అంకురార్పణ నుంచి చక్రస్నానం వరకు ఆయన ప్రధాన పాత్రపోషిస్తారు. ఉదయం, సాయంత్రం మడిని పాటిస్తూ నిత్యహోమాలు, ఇతర వైదిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఉత్సవాలు పూర్తయ్యే వరకు పొలిమేర దాటరు.



ఏర్పాట్లు భేష్..!

- ఊరేగింపుగా వెళ్లి పరిశీలించిన విష్వక్సేనుడు
- శ్రీవారి ఆలయంలో శాస్త్రోక్తంగా అంకురార్పణ

తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలకు మంగళవారం రాత్రి శాస్త్రోక్తంగా అంకురార్పణ నిర్వహించారు. ఇందులో భాగంగా శ్రీవారి సేనాధిపతి అయిన విష్వక్సేనుడు రాత్రి 7 గంటలకు విశేష అలంకరణలో గదతో తిరుచ్చి వాహనంపై ఆలయం నుంచి వెలుపలకు వచ్చారు. మహాద్వారం వద్ద హారతి అందుకుని నాలుగు మాడవీధుల్లో ఊరేగుతూ బ్రహ్మోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. ఇక, ఆలయంలోని యాగశాలకు సమీపంలో అంకురార్పణ జరిగే ప్రదేశాన్ని ముందుగానే పేడతో అలంకరించారు. సేనాధిపతి ఊరేగింపు తర్వాత ఆ ప్రదేశంలో బ్రహ్మపీఠాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం మంట ద్వారా బ్రహ్మ, గరుడ, శేష, సుదర్శన, వక్రతుండ, సోమ, శంత, ఇంద్ర, ఇసాన, జయ అనే దేవతలను ఆహ్వానించారు. అనంతరం భూమాతను ప్రార్థిస్తూ అందులో ముందుగానే సేకరించిన మట్టిని కుండలలో వేసి శాలి, వ్రహి, యువ, ముద్గ, మాష, ప్రియంగు వంటి నవధాన్యాలను చల్లి నీరు పోశారు. ఆ పాలికలను నూతన వస్త్రంతో అలంకరించి పుణ్యాహవచనం నిర్వహించారు. ఇలా శాస్త్రోక్తంగా అంకురార్పణ నిర్వహించారు. ప్రతిరోజూ ఈ పాలికల్లో కొద్దిగా నీరు పోస్తూ మొలకలు వచ్చేలా చర్యలు తీసుకుంటారు. ఉత్సవాలు విజయవంతం కావాలని సంకల్పించడంతో పాటు స్వామి ఆశీస్సులు పొందడమే ఈ ఘట్ట ఉద్దేశం. ఆయా కార్యక్రమాల్లో టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులు పనబాక లక్ష్మి, దివాకర్‌రెడ్డి, నరేష్, శాంతారామ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

స్వామిసేవకు 50 మంది అర్చకులు

వాహనసేవలను, యాగశాల్లో కైంకర్యాలను ఆగమోక్తంగా నిర్వహించేందుకు 50 మందికిపైగా అర్చకులు సిద్ధమయ్యారు. ఉదయం, రాత్రి జరిగే వాహనసేవలతో పాటు యాగశాల, గర్భాలయం, ఉప ఆలయాలు వంటి వివిధ ప్రాంతాల్లో కైంకర్యాల కోసం అర్చకులకు విధులు కేటాయిస్తూ ప్రణాళికలు రూపొందించుకున్నారు. ఇక, వాహనసేవల్లోని ఉత్సవర్లను అలంకరించేందుకు ఎప్పటిలానే చెన్నై నుంచి మరో ఇద్దరు అలంకరణ భట్టాచార్యులు తిరుమలకు చేరుకున్నారు.

టీటీడీ బోర్డులో తిరుపతి ఎమ్మెల్యేకి చోటెప్పుడు?

- కోర్టు తీర్పు, ప్రభుత్వ ఉత్తర్వులున్నా ఆలస్యమెందుకో?

(తిరుపతి- ఆంధ్రజ్యోతి)

- తిరుమల బాలాజీనగర్‌లో కాలనీ బాగా దెబ్బతిన్న ఇళ్లను బాగు చేయాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అక్కడి స్థానికుల విజ్ఞప్తి మేరకు పలుసార్లు టీటీడీ ఉన్నతాధికారులను కోరారు. కానీ ఇప్పటివరకు ఒక ఇటుక కూడా కదలలేదు.
- తిరుపతిలో టీటీడీ చేయాల్సిన కొన్ని మౌలిక సదుపాయాల కల్పనకు ఎమ్మెల్యే గొంతు వినిపించే అవకాశం దొరకలేదు.

తిరుపతి నగర అభివృద్ధి టీటీడీతో ముడిపడి ఉంటుంది. టీటీడీ ఉద్యోగులంతా నివసించేది తిరుమలలోనే. ఈ రెండింటికీ వారధిగా ఉండాల్సిన ప్రజాప్రతినిధులకు టీటీడీ పాలకమండలిలో అవకాశం ఉంటే ఎక్కువ ప్రయోజనం ఉంటుంది. వైసీపీ ప్రభుత్వంలో ఆ అవకాశం తిరుపతి ఎమ్మెల్యేకి దక్కినా, కూటమి ప్రభుత్వంలో మాత్రం లభించలేదు. తిరుపతి నియోజకవర్గ ప్రజాప్రతినిధిగా టీటీడీ పాలక మండలిలో మాట్లాడే అవకాశం ఉంటే సమస్యలు సత్వరమే పరిష్కార దిశగా అడుగులు పడే వీలుంటుంది. తిరుపతి ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యమిచ్చి బడ్జెట్ కేటాయింపులు, పనుల్లో వేగం పెంచేలా చేయవచ్చు. స్థానిక సమస్యలను, అభ్యర్థనలను బోర్డు సమావేశాల్లో వినిపించవచ్చు. పాలకమండలిలో ఎమ్మెల్యే ఉండడం వలన ప్రజల సమస్యలు, అభ్యర్థనలు త్వరగా పరిష్కారమయ్యేందుకు వీలుంటుంది. రాష్ట్ర ప్రభుత్వానికి టీటీడీకి మధ్య వారధిగా ఎమ్మెల్యే పనిచేసే సౌలభ్యం ఉంటుంది. అంతేకాకుండా తిరుపతి నగరానికి ప్రత్యేక గుర్తింపు, ప్రాధాన్యత, అభివృద్ధి అవకాశాలు పెరిగే అవకాశం ఉంటుంది.

తుడాకిచ్చి ఎమ్మెల్యేని పక్కనపెట్టి

దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం నుంచి తుడా ఛైర్మన్‌ను టీటీడీ ఎక్స్‌అఫిషియోగా చేర్చారు. 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చాక ఆ విధానాన్ని రద్దుచేశారు. 2019లో అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి ప్రభుత్వం తిరుపతి ఎమ్మెల్యే, తుడా ఛైర్మన్లకిద్దరికీ టీటీడీ పాలక మండలిలో అవకాశం కల్పించింది. ఈక్రమంలో ప్రత్యేక ఆహ్వానితులుగా జగన్‌రెడ్డి 52 మందితో జంబో కమిటీవేస్తే కోర్టు మొట్టికాయలు వేస్తూ రద్దు చేసింది. అయితే తిరుపతి ఎమ్మెల్యేగా టీటీడీ పాలక మండలిలో ఉండొచ్చని కోర్టు చెప్పింది. దీంతో అప్పటి ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి ప్రత్యేక ఆహ్వానితుడిగా కొనసాగారు. ఆతర్వాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేవలం తుడా ఛైర్మన్‌కు మాత్రమే టీటీడీ ఎక్స్‌అఫిషియోగా కొనసాగిస్తూ జీవో ఇచ్చారు. ఎమ్మెల్యేను మాత్రం సందిగ్ధంలో పెట్టేశారు.

టీటీడీ బోర్డులో చోటెందుకంటే..?

టీటీడీలో రెగ్యులర్, అవుట్‌సోర్సింగ్ ఉద్యగులు దాదాపు 20వేలకుపైనే ఉన్నారు. అదేవిధంగా తిరుమలలోని బాలాజీనగర్‌లో దాదాపు 1100 కుటుంబాలు నివసిస్తున్నారు. వీరంతా తిరుపతి నియోజకవర్గ ఓటర్లే. ఎమ్మెల్యేగా వారి సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ఆయనపై ఉంది. దేశ నలుమూలల నుంచి శ్రీవారి దర్శనం కోసం వచ్చే యాత్రికులకోసం తిరుపతి, తిరుమలలో మౌలిక సదుపాయాలు మెరుగుపరచడానికి కృషిచేయాల్సివుంది. టీటీడీతో పాటు తిరుమల స్థానిక ప్రజల నుంచీ నిరంతరం ఫిర్యాదులు వస్తుంటాయి. వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలంటే ఎమ్మెల్యేగా అంత వీలుండకపోవచ్చు. అదే పాలకమండలిలో చోటుంటే సమస్యల పరిష్కారానికి మార్గం సుగమం చేయవచ్చు.

పవన్ ద్వారా ఎమ్మెల్యే వినతి

టీటీడీ పాలకమండలిలో ప్రత్యేక ఆహ్వానితుడిగా ఉన్న జీవోను కొనసాగించాలని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఇదివరకే సీఎం చంద్రబాబుకు వినతిపత్రం అందించారు. అంతేకాకుండా జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లి ఆయన సంతకం చేసిన వినతి కూడా సీఎంవోకు వెళ్లింది. అయినా పాలకమండలి నియామకం జరిగి ఏడాది దగ్గరపడుతున్నా ప్రభుత్వం మౌనంగా ఉండడంపై జనసైనికులు నైరాశ్యంలో ఉన్నారు. తిరుపతిలో పార్టీ అస్తిత్వానికి సంబంధించిన అంశంగా భావిస్తున్నారు.

నేడు ఉపరాష్ట్రపతి రాక

తిరుపతి(కలెక్టరేట్)/తిరుమల, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ బుధవారం సాయంత్రం 7.30 గంటలకు ప్రత్యేక విమానంలో రేణిగుంట విమానాశ్రయం చేరుకుంటారు. రోడ్డు మార్గాన తిరుమల చేరుకుని శ్రీవారిని దర్శించుకుంటారు. గురువారం ఉదయం మరోసారి శ్రీవారిని దర్శించుకున్నాక పలు కార్యక్రమాలలో పాల్గొంటారు. 11.30 గంటలకు తిరుచానూరు పద్మావతి అమ్మవారిని దర్శించుకుని ఢిల్లీకి తిరుగు ప్రయాణమవుతారు.

వీఐపీలకు విస్తృత బందోబస్తు



తిరుపతి (నేరవిభాగం), సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉపరాష్ట్రపతి, సీఎం పర్యటన నేపథ్యంలో జిల్లా పోలీసు యంత్రాంగం పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసింది. తిరుపతిలో అదనపు ఎస్పీ, ఇద్దరు డీఎస్పీలు, 25 మంది సీఐలు, 50 మంది ఎస్ఐలు, మరో 150 మంది ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్ళు, కానిస్టేబుళ్లు, హోంగార్డులు, బాంబు డిస్పోజల్, డాగ్ స్క్వాడ్‌లు బందోబస్తులో పాల్గొంటారు. రేణిగుంట విమానాశ్రయం నుంచి తిరుమల మార్గంలో గట్టి నిఘా ఏర్పాటు చేశారు. వీఐపీల భద్రతకు ఇద్దరు అదనపు ఎస్పీలు, రిజర్వు బలగాలు, ఐదుగురు డీఎస్పీలు, 10 మంది సీఐలు, 20 మంది ఎస్ఐలు, మరో 300 మంది ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, పోలీసులను వినియోగిస్తున్నారు.ఏపీఎస్పీ, రిజర్వు, ఆక్టోపస్, విజిలెన్సు, సిబ్బంది బందోబస్తు విధుల్లో నిమగ్నమయ్యారు. వీఐపీలు వెళ్ళే సమయంలో 45 నిమిషాల ముందు ఘాట్‌లో వాహనాల రాకపోకలను ఆపనున్నారు. సీసీ కెమెరాలు, డ్రోన్లతో నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.


రేపు సీఎం ప్రారంభించనున్న ఏఐ కమాండ్ కంట్రోల్ సెంటర్

శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించనున్న సీఎం

తిరుమల/తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు ప్రభుత్వం తరపున శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. దీనికోసం ఆయన బుధవారం సాయంత్రం హెలికాప్టర్‌లో తిరుపతిలోని తాజ్ హోటల్ వద్ద హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. రోడ్డు మార్గాన తిరుమలలోని గాయత్రి నిలయానికి వస్తారు. రాత్రి 7.40గంటలకు బేడీ ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణానికి చేరుకుంటారు. ఆయనకు అర్చకులు పరివట్టం చుట్టగా తలపై వెండిపళ్లెంలో పట్టువస్త్రాలను ఈవో ఉంచుతారు. మంగళవాయిద్యాల నడుమ ఆలయానికి చేరుకుని వస్త్రాలను బహూకరించి మూలవర్లను దర్శించుకుంటారు. రంగనాయకుల మండపంలో టీటీడీ 2026 డైరీ, క్యాలెండర్లు ఆవిష్కరిస్తారు. వాహన మండపం వద్ద పెద్దశేషవాహన సేవలో పాల్గొంటారు. గురువారం ఉదయం 9.10 గంటలకు భక్తుల వసతిగృహం వెంకటాద్రి నిలయాన్ని ప్రారంభిస్తారు. ఏఐ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను(ఐసీసీసీ)- ఇంటెలిజెంట్ క్రౌడ్ అండ్ సైబర్ కంట్రోల్, ప్రసాదాలకు సంబంధించిన ప్లాంట్‌ను ప్రారంభించి తిరుగు ప్రయాణమవుతారు. అలాగే, మంత్రి నారా లోకేశ్ కూడా పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు నుంచి హెలికాప్టర్‌లో బుధవారం సాయంత్రం 5 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడ్నుంచి రోడ్డు మార్గాన తిరుమలలోని గాయత్రి గెస్ట్ హౌస్‌కు చేరుకుంటారు. రాత్రి 7.30 నుంచీ 9 గంటల నడుమ శ్రీవారిని దర్శించుకుంటారు. గురువారం ఉదయం 10.15 గంటలకు తిరుగు ప్రయాణమవుతారు.

శరన్నవరాత్రి అలంకరణలు


మంగళవారం బాలాత్రిపుర సుందరి అలంకారంలో తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ, శ్రీకాళహస్తిలోని కనకాచలంపై కొలువైన కనకదుర్గమ్మ, గాయత్రీదేవి అలంకరణలో సూళ్లూరుపేట చెంగాళమ్మ, చిల్లకూరు మండలం తూర్పు కనుపూరులోని ముత్యాలమ్మ అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడిగా తిరుమల శ్రీవేంకటేశ్వరుడిని భక్తజనం కొలుస్తారు. దేశం నలుమూలల నుంచీ తండోపతండాలుగా తరలివస్తారు. స్వామి వైభవాన్ని చూసి తరిస్తారు. వెయ్యేళ్లుగా తిరుమల ఆలయంలో కొనసాగుతున్న పూజా కైంకర్యాలు, స్వామికి అలంకరించే ఆభరణాలు, అనుసరిస్తున్న ఆచార సంప్రదాయాలు.. వెనుక ఆయన భక్తాగ్రేసరులు ఎందరో ఉన్నారు. చక్రవర్తుల మొదలు సామాన్యుల దాకా ఆయన సేవలో తరించి అనుగ్రహం అందుకున్నారు.. అందులో కొందరి గురించి బ్రహోత్సవాల సందర్భంగా స్మరించుకుందాం..



సేవింతురే!



చిత్రం: పి.రమేష్, శ్రీకాళహస్తి

శ్రీవారి సర్వసేనాని

తిరుమల శ్రీవారి ఆలయంలో వైకుంఠప్రదక్షిణ ద్వారానికి పక్కన చిన్న మందిరంలో దక్షిణాభిముఖంగా విష్వక్సేనుడి శిలాప్రతిమ ఉంటుంది. ఆణివార ఆస్థానంలోను, ఉగాది, దీపావళి ఆస్థానాల్లోను, బ్రహ్మోత్సవాల్లోను, విశేష తిరువీధి ఉత్సవాల్లోను పంచ ఆయుధాలు ధరించిన పంచలోహ విష్వక్సేనుడు మాడవీధుల్లో ఊరిగి ఏర్పాట్లను పర్యవేక్షిస్తాడు. శ్రీవేంకటేశ్వరస్వామికి ప్రధాన సైన్యాధిపతి ఈయన. విష్వక్సేనుడు అంటే అంతటా వ్యాపించిన సేన కలవాడు అని అర్థం. 'విష్వక్సేనో జనార్దనః' అని అమరం పేర్కొంటుంది. విష్వక్సేనుడు అనే పేరు విష్ణుదేవుని సేనాపతికీ ఉంది. విష్ణుదేవుడే తన సైన్యాల కోసం తానే సేనాపతిగా అవతరించి విష్వక్సేనుడు అయ్యాడు అంటారు. కాకపోతే వేరొకరు జగన్నాయకుని సేనలకు ఆధిపత్యం వహించగలరా? మంగళవారం అంకురార్పణ రోజున ఆయన మాడవీధుల పర్యవేక్షణ తర్వాతే బ్రహ్మోత్సవ సంరంభం ఆరంభం అయ్యింది.




సిద్ధమైన సైకత శిల్పం

అలాగే ఈసారి 'వైకుంఠంలోని విమాన వేంకటేశ్వరస్వామి గోపురాన్ని తిరుమలకు తెస్తున్న గరుడుడు' అనే అంశంపై సాండ్ ఆర్ట్‌ను కూడా సిద్ధం చేశారు.

సర్వదర్శనానికి 8 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 21 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.4.06 కోట్లు
సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 60,681
తలనీలాలు సమర్పించినవారు: 19,510



భగవద్బంధువులు శ్రీవారి సేవకులు

చైర్మన్ బీఆర్ నాయుడు



తిరుమల, సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి): తిరుమలలో భక్తులకు సేవలు అందిస్తున్న శ్రీవారిసేవకులు భగవద్బంధువులు అని టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడు అన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు సేవలందించేందుకు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన శ్రీవారిసేవకులతో తిరుమలలోని ఆస్థానమండపంలో మంగళవారం ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. 'తిరుమలకు వచ్చే భక్తుల్లోనే భగవంతుడు ఉన్నాడు. వారికి సేవ చేస్తే భగవంతుడికి సేవ చేసినట్లే' అన్నారు. దేశంలోని ఎంతోమంది ప్రముఖులు శ్రీవారి సేవ చేసేందుకు ఉత్సాహం చూపిస్తున్నార న్నారు. శ్రీవారిసేవకులకు ప్రస్తుతం కల్పిస్తున్న సాధారణ దర్శనం స్థానంలో స్వామిని మరింత దగ్గరగా దర్శించుకునేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను అధికారులను కోరారు. దీనిపై బోర్డులో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. బోర్డు సభ్యుడు నరేష్‌కుమార్, సీవీఎస్వో మురళీకృష్ణ, డీఎఫ్‌వో ఫణికుమార్ నాయుడు, సీపీఆర్వో రవి, ఇతర అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



90 వేల మొక్కలతో పుష్పప్రదర్శన శాల

తిరుమలలోని కల్యాణవేదిక వద్ద ఎప్పటిలానే ఫల పుష్ప ప్రదర్శన శాల సిద్ధమైంది. దాదాపు 90 వేల మొక్కలను ఈసారి ప్రదర్శనలో ఉంచారు. ఇందులో 18 రకాల పుష్పమొక్కలను వివిధ రంగుల్లో ఒకేచోట చూసే అవకాశం భక్తులకు లభించనుంది. ఇక, పండ్లు, కూరగాయలతో పక్షులు, జంతువులను ఏర్పాటు చేశారు. శ్రీరాముడిపైనే యుద్ధానికి సిద్ధపడిన హనుమంతుడు, భీముడు-బకాసురుడి యుద్ధం, శ్రీరాముడు ద్వితీయ వివాహం చేసుకున్నాడనే సీతమ్మ అనుమానాన్ని నివృత్తి చేస్తున్న వాల్మీకి మహర్షి, ఇంద్రుడితో యుద్ధం చేస్తున్న శ్రీకృష్ణార్జునులు, లంకిణి అనే రాక్షసి నోట్లోకి ప్రవేశిస్తున్న ఆంజనేయుడు, లంకాదహనం, విష్ణువుకు పవళింపుసేవ చేస్తున్న ఆంజనేయుడు, ఘటోత్కజుడు, చిన్నకృష్ణుని లీలలు, శ్రీకృష్ణుణి తులాభారం, అహంకార భక్తికంటే ఆత్మశుద్ధితో పూజించేవారికే తాను విధేయుడని నిరూపిస్తున్న స్వామి.. ఇలా పురాణాల్లోని దాదాపు 14 ఘట్టాలను కళ్లకు కట్టినట్టు చూపే సెట్టింగులు వేశారు. ఈప్రదర్శనశాల గురువారం నుంచి భక్తులకు అందుబాటులోకి రానుంది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి





అంగరంగ

వైభవంగా జరిగే శ్రీవేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలకు సకల దేవతలనూ ఆహ్వానిస్తూ ఆలయంలో ఎగరేసేదే ధ్వజపటం. ఆహ్వానం పలికేవాడు గరుడుడు. కొడితాడు సాయంతో ధ్వజస్తంభం శిఖరానికి చేర్చి ఎగరేసే కార్యక్రమమే ధ్వజారోహణం. బ్రహ్మోత్సవాలు జరిగే తొమ్మిది రోజులూ రెపరెపలాడే ధ్వజపటం నుంచి గరుడుడు వేడుకలను వీక్షిస్తుంటాడు. పసుపువర్ణంతో ఎగిరే ఈ పతాకం మీద రెక్కలు విప్పుకుంటూ ఒక కాలు నేలకు ఆన్చి మరో కాలు గాల్లోకి లేస్తున్నట్టుగా గరుడుడి చిత్రం ఉంటుంది. తొమ్మిది అడుగుల ధ్వజపటాన్ని 40 ఏళ్లుగా రూపొందించే అరుదైన అవకాశం తిరుపతి చిత్రకారుడికి దక్కింది. ఆయనపేరు శ్రీవశ్రీ. పూర్తి పేరు పేరూరు శివప్రసాద్. టీటీడీ చిత్రకారుడిగా సుప్రసిద్ధుడు. 40వ ధ్వజపటచిత్రాన్ని సోమవారం నాడు తిరుమల ఆలయంలో స్వామి పాదాల ముందుంచి అధికారులకు అప్పగించిన శివశ్రీ ఆంధ్రజ్యోతితో పంచుకున్న విశేషాలు...

- ఆంధ్రజ్యోతి - తిరుపతి

శ్రీవారికి

శివశ్రీ చిత్రకైంకర్యం


40 ఏళ్లుగా ధ్వజపటం సమర్పిస్తున్న చిత్రకారుడు

నిష్ఠతో మూడు రోజులు

గరుడపటం కోసం మూడుకి 9 అడుగుల నిడివి ఉండే తెల్లని మెత్తని వస్త్రంను ఎంచుకుంటాం. పసుపులో ఒక రోజంతా ఆ గుడ్డను నానబెట్టాలి. ఆ తర్వాత నిమ్మ ఉప్పులో ఒక గంట ఉంచాలి. ఆరిన తర్వాత చిత్రరచన మొదలవుతుంది. నా శ్రీమతి పసుపు అద్దకం పూర్తయ్యాక ఒక గదిలో మూడు రోజులు నిష్ఠతో నేను మాత్రమే చేసే కార్యం ఇది. బొగ్గు, ఎర్రమట్టి, నామం కొమ్ము, తిరుచూర్ణం ఇందుకు వినియోగిస్తాం. క్రీడాఉద్యానవనాన్ని భూమి మీదకు దించినవాడు గరుడుడు. భూమితో ఆయనకున్న అనుబంధానికి సంకేతంగానే ఎర్రమట్టిని చిత్రరచనలో వాడుతారు. నామంతెలుపు రంగునూ, తిరుచూర్ణం ఎరుపునూ ఇస్తాయి.

1986 నుంచి మొదలు

1979లో టీటీడీలో నేను చేరాను. రిటైరైన తర్వాత కూడా గరుడపటం గీసే అదృష్టం నాకు ఆ స్వామి ఇచ్చాడు. 1986 నుంచీ నేను గరుడచిత్రం గీస్తున్నాను. అంతకు మునుపు టీటీడీకి సంబంధంలేని బయటి చిత్రకారులు దీనిని రూపొందించేవారు. భక్తి శ్రద్ధలతో, నియమనిష్ఠలతో చేయాల్సిన పని ఇది.. టీటీడీలో అటువంటి చిత్రకారులు లేరా అని అప్పటి ఆలయ అధికారులు బ్రహ్మోత్సవాల నిర్వహణపై ముందస్తుగా నిర్వహించిన సమావేశంలో అన్నారట. ఉన్నారని భరోసా ఇచ్చినవారు డాలర్ శేషాద్రి. నాకు మంచి మిత్రుడు. నిజానికి ఈ అవకాశం మొదట హెన్రీ గారికి వచ్చింది. ఆయనే నాపేరును సూచించారు. తొలిసారి చిత్రం ప్రారంభించే ముందు జియ్యంగార్లు, ఆలయ అర్చకులు నన్ను కూర్చోబెట్టుకుని గరుడ పటం విశిష్టత గురించి, గరుడుడి ప్రాధాన్యం గురించి చాలా వివరించారు. భక్తితో చేయాల్సిన పని అంటూ అప్పగించారు. అలా మొదలైన గరుడచిత్రకైంకర్యం 40 ఏళ్లుగా కొనసాగుతోంది. స్వామి తనకు సేవచేసేందుకు కొందరిని ఎంచుకుంటాడు. అలాంటివారిలో బహుశా నేనూ ఒకడిని. లేకపోతే రిటైరైన తర్వాత కూడా ఈ అపురూప అదృష్టం నాకు దక్కేదా?



"ధ్వజపటం వేయడం అన్నది చిత్రకళకు మాత్రమే పరిమితమైనది కాదు. అదొక దివ్యానుభూతి. స్వామితో ఏర్పడిన ఆత్మిక బంధం. ఈ పనికి ఆయన నన్ను ఎంచుకున్నాడు. నా ప్రయత్నం మాత్రమే అయితే 40 ఏళ్లు నిర్విఘ్నంగా సాగేదేనా?!





సర్పాలే ఆభరణాలు

చిత్రంలోని గరుడుడికి అలంకారాలుగా అమరేది అష్టమహా సర్పాలు. శిరస్సున కిరీటంలా మారిన శంకువును అల్లుకుని సర్పాలుంటాయి. చెవి రింగులుగా పద్మ, మహాపద్మాలు, కంఠాభరణంగా కర్కోటకుడు, యజ్ఞోపవీతంగా వాసుకి, నడుమును చుట్టుకుని తక్షకుడు, కుడి, ఎడమ చేతులకు కంకణాలుగా గుళికుడు, అనంతుడు ఆభరణాలుగా ఉంటారు.



గూడూరును జిల్లాగా ప్రకటించాలి



గూడూరు నుంచి జిల్లా కేంద్రమైన తిరుపతి 100 కిలోమీటర్ల దూరంలో ఉంది. స్థానికులు, అధికారులు జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే వ్యయప్రయాసలకు గురవుతున్నారు. ఎన్నికల సమయంలో గూడూరును నెల్లూరు జిల్లాలో కలుపుతామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు నెల్లూరు జిల్లాలో కలపాలి. లేదా గూడూరు కేంద్రంగా జిల్లాగా ప్రకటించాలి.

- పాశం సునీల్‌కుమార్, గూడూరు ఎమ్మెల్యే

ట్రామాకేర్ సెంటర్ కావాలి



సూళ్లూరుపేట నియోజకవర్గంలో సుదీర్ఘమైన జాతీయ రహదారి ఉంది. ప్రమాదాల సమయంలో అత్యవసర వైద్యం కోసం నెల్లూరు, తిరుపతి, చెన్నై వెళ్లాల్సి రావడం ఇబ్బందిగా ఉంది. అందుకని నాయుడుపేట లేదా సూళ్లూరుపేటలో ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటు చేయాలి. సీహెచ్‌సీలు, పీహెచ్‌సీ, యూహెచ్‌సీని అప్‌గ్రేడ్ చేయాలి. ఆస్పత్రుల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి.

- నెలవల విజయశ్రీ, సూళ్లూరుపేట ఎమ్మెల్యే

గ్రీన్ అంబాసిడర్లకు జీతాలేవీ?



ఇంటింటికి తిరిగి చెత్త సేకరించే గ్రీన్ అంబాసీడర్లకు ఆరు నెలలుగా జీతాలు అందలేదు. శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని ముక్కంటి ఆలయానికి అనుసంధానం చేస్తే రోగులకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించేందుకు వీలవుతుంది. పశువుల షెడ్లు, ఉపాధి హామీ పథకం కూలి జమ కాకపోవడంతో కూలీలు ఇబ్బంది పడుతున్నారు. శ్రీకాళహస్తి పురపాలకసంఘానికి వంద మంది సిబ్బందిని నియమించాలి.

- బొజ్జల సుధీర్, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే

ఆర్డీవో కార్యాలయం ఏర్పాటు చేయండి



ఏడు మండలాలు, శ్రీసిటీ ఉన్న రిజర్వుడు నియోజకవర్గమైన సత్యవేడులో ఆర్డీవో కార్యాలయం ఏర్పాటు చేయాలి. పిడుగుపాటు, విద్యుత్ షాక్ తదితర ప్రమాదాలకు గురై హఠాన్మరణం చెందుతున్న బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలి.

- ఆదిమూలం, సత్యవేడు ఎమ్మెల్యే

ఎంపీపీ కుర్చీకోసం కీచులాట!

- వరదయ్యపాళెం వైసీపీలో వర్గపోరు.. క్యాంపునకు ఎంపీటీసీలు

వరదయ్యపాళెం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వరదయ్యపాళెం ఎంపీపీ కుర్చీ కోసం వైసీపీలో కుమ్ములాట మొదలైంది. ఆ పార్టీ మండల కన్వీనర్ దయాకర్‌రెడ్డి, ప్రస్తుత ఎంపీపీ పద్మప్రియ భర్త దామోదరం రెడ్డి మధ్య వర్గపోరు నెలకొంది. ఈ క్రమంలో ఎంపీపీని దింపేందుకు దాదాపు 9 మంది ఎంపీటీసీ సభ్యులను దయాకర్ రెడ్డి క్యాంపునకు తరలించినట్లు సమాచారం. అదే సమయంలో ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టేందుకు వారిని సిద్ధం చేసినట్లు తెలిసింది. ఇదంతా ఎందుకంటే.. 2021లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంపీపీ అభ్యర్థులుగా దయాకర్‌రెడ్డి తన భార్య హేమలతను, దామోదర్‌రెడ్డి కూడా తన భార్య పద్మప్రియను వేరువేరు సెగ్మెంట్లలో బరిలోకి దించగా ఇద్దరూ విజయం సాధించారు. ఎంపీపీ పదవిపై అప్పట్లో తీవ్ర పోటీ నెలకొనగా అప్పటి వైసీపీ పెద్దల ఆశీస్సులతో దామోదర్‌రెడ్డి మెజారిటీ ఎంపీటీసీ సభ్యులను పాండిచ్చేరి తరలించి.. పద్మప్రియను ఎంపీపీగా చేసుకున్నారు. అలకపాన్పు ఎక్కిన దయాకర్‌రెడ్డిని అప్పట్లో వైసీపీ పెద్దలు ఎంపీపీ పదవిని రెండున్నర సంవత్సరాలు చెరో సగం పంచుకోవాలని సూచించినట్లు వార్తలు వెలువడ్డాయి. దీనికి సమ్మతించని దయాకర్‌రెడ్డి ఎంపీపీ రేస్‌నుంచి తప్పుకొన్నారు. ఈ క్రమంలో ఇప్పుడాయన అసమ్మతి ఎంపీటీసీ సభ్యులను తనవైపు తిప్పుకుని ఎంపీపీపై అవిశ్వాస తీర్మానానికి తెరలేపారు. బుధవారం కలెక్టర్‌ను కలిసి ఎంపీటీసీ సభ్యులతో అవిశ్వాస తీర్మానికి సన్నాహాలు చేసుకుంటున్నట్లు తెలిసింది. ఈ మేరకు సోషల్ మీడియాలో వైరల్ కాగా, దీనిపై ఇద్దరూ మౌనం వహిస్తుండడం గమనార్హం.

రబీ సీజన్‌కు సమృద్ధిగా ఎరువులు



తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రబీ సీజన్‌కు 3.5 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతాయని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. దీనికి సంబంధించి ఎరువులుగా సమృద్ధిగా ఉన్నాయని, రైతులు ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన ఎరువులపై అధికారులతో సమీక్షించారు. ప్రస్తుతం ఏపీ మార్క్‌ఫెడ్, రైతు సేవా కేంద్రాల వద్ద 2,128 టన్నులు, ప్రైవేటు డీలర్ల వద్ద 2,050 టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. వచ్చే నెల మొదటి వారానికల్లా మరింత యూరియా తెప్పించేలా చర్యలు చేపడతామన్నారు. అవసరమైన మేరకే ఎరువులు వాడాలని, ఎక్కువగా వాడటం పర్యావరణానికి కూడా మంచిది కాదన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, జిల్లా వ్యవసాయాధికారి ప్రసాదరావు, ఏపీమార్క్‌ఫెడ్ డీఎం పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ స్టడీసర్కిల్‌లో ఉచిత శిక్షణ

తిరుపతి(విద్య), సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉద్యోగులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ సొసైటీ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ టి. పద్మజ మంగళవారం తెలిపారు. ఐబీపీ క్లర్క్, ప్రొబేషనరీ ఆఫీసర్, ఆర్‌ఆర్‌బీ ఆఫీసర్ స్కేల్-2, 3, ఆఫీస్ అసిస్టెంట్, ఎస్ఎస్‌సీ సీజీఎల్ టియర్-2 వంటి పోటీ పరీక్షల టైర్-2, మెయిన్ పరీక్షలకు తిరుపతి స్టడీ సర్కిల్‌లో ఉచిత వసతి సౌకర్యాలతో 60 రోజులపాటు శిక్షణ ఉంటుంది. అభ్యర్థులు **apstdc.apcfss.in** వెబ్‌సైట్ ద్వారా వచ్చేనెల 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి. డిగ్రీ కలిగి ఉండాలి. సంబంధిత పరీక్షల టైర్-1 లేదా ప్రిలిమినరీ పరీక్ష రాసుండాలి. వివరాలకు తిరుపతిలోని బీఆర్ అంబేద్కర్ స్టడీ సర్కిల్ కార్యాలయం లేదా ఏపీఎస్‌డబ్ల్యుఆర్ఈఐఎస్‌ను 86396 27455, 81422 24539 లలో సంప్రదించాలి.

'ఎర్ర' స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలు

తిరుపతి(నేరవిభాగం) సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.ఆరు లక్షల జరిమానా విధిస్తూ ఎర్రచందనం రాష్ట్ర స్థాయి కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి మంగళవారం తీర్పు చెప్పారు. రెడ్ శ్యాండిల్ టాస్క్‌ఫోర్సు చీఫ్ సుబ్బరాయుడు కథనం మేరకు.. తమిళనాడు రాష్ట్రం ధర్మపురి జిల్లాకు చెందిన అండి 2017లో చామల రేంజ్, నాగపట్ల సెక్షన్, బొబ్బాలబావి పరిధిలో ఎర్రచందనం చెట్లు నరకడానికి అడవిలోకి వెళుతున్నాడు. అప్పట్లో అటవీశాఖ, టాస్క్‌ఫోర్సు అధికారులు దాడులు చేసి అతడిని పట్టుకున్నారు. దీనిపై విచారించి కేసు నమోదు చేశారు. అనంతరం కోర్టు ఎదుట హాజరుపరచగా అతడికి రిమాండ్ విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ఈ నేపథ్యంలో ఈ కేసును తిరుపతిలోని రాష్ట్రస్థాయి ఎర్రచందనం కోర్టుకు బదిలీ చేసి కేసు విచారించారు. దీనిపై స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అమర నారాయణ వాదనలు వినిపించారు. ఇరువర్గాల వాదనలు విన్న న్యాయమూర్తి నరసింహమూర్తి నిందితుడికి ఐదేళ్ల జైలుతో పాటు రూ.ఆరు లక్షల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

ప్లాస్టిక్ కవర్ల వినియోగం తగ్గించేందుకు చర్యలు



సమావేశంలో వివరాలను వెల్లడిస్తున్న ఉపాధి ఏపీవో

తడ, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్లాస్టిక్ కవర్ల వినియోగం తగ్గించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో శేఖర్‌నాయక్ అన్నారు. మంగళవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. వివిధ శాఖల్లో అభివృద్ధి పనులు, ప్రభుత్వ పథకాలపై చర్చించారు. బీవీపాళెం, వాటంబేడు, పాములమిట్ట గ్రామాల్లో నీళ్ల ట్యాంక్‌లు శిథిలావస్థలో ఉన్నాయని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రకాష్ సమావేశం దృష్టికి తీసుకురావడంతో వాటిని తొలగించేందుకు అయ్యే ఖర్చులపై నివేదిక తయారు చేయాలని ఎంపీపీ కొలవి రఘురెడ్డి సూచించారు. అలాగే మాంబట్టు, వెండ్లూరుపాడు పంచాయతీల్లో విద్యుత్ సరఫరాలో సమస్యలు ఎదురవుతున్నాయని, దీనివల్ల మోటార్లు కాలిపోతున్నాయని సర్పంచులు రమణయ్య, మునిరత్నంరెడ్డి తెలపగా, సమస్య పరిష్కరిస్తామని సంబంధిత అధికారులు హామీ ఇచ్చారు. ఎంపీడీవో శేఖర్‌నాయక్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగంపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించి వాటి వినియోగం తగ్గేలా చర్యలు తీసుకోవాలని తీర్మానం ప్రవేశపెట్టగా సభ్యులందరూ ఆమోదించారు. సమావేశంలో జడ్పీటీసీ ఇందుమతి, తహసీల్దారు శరత్‌బాబు, ఎంఈవో వేములు, వైస్‌ఎంపీపీ అధ్యక్షుడు వెంకటేష్, ఆర్‌డబ్ల్యూఎస్, ఐకేపీ, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవోలు ప్రకాష్, రాజారెడ్డి, నాగరాజు, వివిధశాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కష్టపడిన ప్రతి కార్యకర్తకూ సముచిత గౌరవం: టీడీపీ



గోపాలకృష్ణను సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

పెళ్లకూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): టీడీపీలో కష్టపడిన కార్యకర్తలకు సముచిత గౌరవం లభిస్తుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య అన్నారు. పెళ్లకూరులోని చిల్లకూరు పీఏసీఎస్ ఛైర్మన్ కేవీ నాయుడు, డైరెక్టర్లుగా పెళ్లకూరు గోపాలకృష్ణ, ఎద్దల రామకృష్ణారెడ్డి బాధ్యతల స్వీకరణ కార్యక్రమం మంగళవారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న కృష్ణయ్య మాట్లాడుతూ టీడీపీలో సామాన్య కార్యకర్తగా ఉన్న పెళ్లకూరు గోపాలకృష్ణకు పీఏసీఎస్ డైరెక్టరుగా నియమించడం ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం కార్యకర్తలకు అండగా నిలుస్తారనడానికి నిదర్శనమని కొనియాడారు. టీడీపీ అభివృద్ధి కోసం అవిశ్రాంతంగా కష్టపడిన నాయకులు, కార్యకర్తలకు తప్పకుండా సముచిత స్థానం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో చిల్లకూరు, కురుగొండ, నాయుడుపేట, సూళ్లూరుపేట, కుందాం పీఏసీఎస్ ఛైర్మన్లు కేవీ నాయుడు, దారా అంకయ్య, ప్రభాకర్ నాయుడు, ఏజీ కిశోర్, పురుషోత్తంరాజు, డైరెక్టర్ ఎద్దల రామకృష్ణారెడ్డి, మాధవరెడ్డి, హరినాయుడు, కల్లూరు సిద్ధార్థ, సుజాతమ్మ, ప్రమీలమ్మ, వెంపళ్ల వెంకటేశ్వర్లు, ఉదయ్ నాయుడు, నరేంద్రయాదవ్, పోలయ్య, సుందరరామిరెడ్డి, మల్లు ప్రసాద్, కాండ్ర రమణయ్య, గురవయ్య, గుంటపూడి రమణయ్య, పరుశురాం, రవి, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

గూడూరు అర్బన్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 35 లక్షల కుటుంబాలకు ప్రయోజనం చేకూర్చే భవననిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని బీసీడబ్ల్యూ జిల్లా గౌరవాధ్యక్షుడు డీపీ పోలయ్య డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక రిటైర్డ్ ఎంప్లాయిస్ భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జీవో 1214 ఉత్తర్వులను వెంటనే వెనక్కి తీసుకోవాలన్నారు. రాష్ట్రాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. ప్రమాదవశాత్తు మృతి చెందిన కార్మికులకు రూ.10లక్షలు, సహజ మరణాలకు రూ.5లక్షలు పరిహారం ఇవ్వాలన్నారు. అలాగే రూ.5 వేలు వృద్ధాప్య పెన్షన్ ఇవ్వాలన్నారు. సంక్షేమ బోర్డు కార్డుకు డిజిటల్ హోదా, ఈఎస్ఐ సౌకర్యం, సబ్సిడీపై రుణాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు చెంగల్‌రావు, అనిల్, నవకోటి, రత్నయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్య సంరక్షణే లక్ష్యం

బాలాయపల్లి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా మహిళల ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా ప్రధాని మోదీ స్వస్థ్ నారీ సశక్తి పరివార్ కార్యక్రమాన్ని తీసుకురావడం జరిగిందని వైద్యాధికారి వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని నిండలి గ్రామంలో స్వస్థ్ నారీ సశక్తి పరివార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు మెరుగైన వైద్య సేవలు అందించడం, పిల్లల ఆరోగ్యానికి ప్రాధాన్యతనివ్వడం, ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సుధాకర్‌రాజు, గోపాల్‌రాజు, అంగనవాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ట్రైసైకిల్ అందజేత



మణికంఠకు ట్రైసైకిల్ అందజేస్తున్న టీడీపీ నాయకులు

గూడూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక అశోక్‌నగర్‌కు చెందిన మణికంఠ కూలీ పనుల నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లి వస్తుండగా ప్రమాదవశాత్తు రైలులో నుంచి జారిపడి అతని రెండుకాళ్లు దెబ్బతిన్నాయి. తనకు ట్రైసైకిల్ అందించాలని ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్‌ను మణికంఠ కోరారు. ఎమ్మెల్యే సహకారంతో టీడీపీ నాయకులు ట్రైసైకిల్‌ను మణికంఠ అందజేశారు. కార్యక్రమంలో పాశిం సురేష్ సాయి, సునీల్, పార్వతయ్య తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారంతోనే బంగారు కుటుంబాలు

కోట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన పీ-4 పథకంలో దాతల సహకారం ఎంతో కీలకమని రిసోర్స్ పర్సన్ ఎస్ కిరణ్‌కుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పీ-4 పథకంపై పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్‌లు, సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ మండలంలో పీ-4 సర్వేను వేగవంతం చేయాలన్నారు. ఇప్పటి వరకు 3,374 కుటుంబాలు బంగారు కుటుంబాల జాబితాలో ఉన్నాయని, మరో 1700 కుటుంబాలను జాబితాలో చేర్చాలన్నారు.

పీపీపీ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్య కళాశాలలను పీపీపీ విధానంలో అభివృద్ధి చేయాలన్న నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని పీడీఎస్‌వో పట్టణ అధ్యక్షుడు పవన్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఎన్‌జేఆర్ సర్కిల్ నుంచి క్రాస్ రోడ్డు మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు.కార్యక్రమంలో పీడీఎస్‌వో నాయకులు పాల్గొన్నారు.



నాయుడుపేట: బాలత్రిపురసుందరిదేవిగా మూకాంబికాదేవి - డక్కిలి: ప్రత్యేక అలంకరణలో పార్వతీదేవి



కోట: గాయత్రిదేవిగా కోటమ్మ - రాజరాజేశ్వరి అలంకరణలో కన్యకా పరమేశ్వరి



సూళ్లూరుపేట చెంగాలమ్మ ఆలయానికి సారె తీసుకెళ్తున్న భక్తులకుతో సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మి - మహాలక్ష్మి అలంకరణలో కన్యకాపరమేశ్వరి

వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

సూళ్లూరుపేట, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం చెంగాళమ్మ గాయత్రీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సూళ్లూరు గంగమిట్ట కాపువీధి, కావలివీధి, గంగమిట్ట, శ్రీనగర్ కాలనీ, పొట్టి శ్రీరాముల వీధి, రైల్వేకాలనీవాసులు అమ్మవారికి సారె సమర్పించారు. సారె తీసుకొచ్చిన వారికి ఆలయ రాజగోపురం వద్ద సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. చండీయాగానికి చెన్నైకి చెందిన అనంతరాము, లక్ష్మీ సుభద్ర, అలంకారానికి నెల్లూరుకు చెందిన గునపాటి మురళికృష్ణా రెడ్డి, ప్రతిమ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. అలాగే వాసవి కన్యకాపరమేశ్వరి మహాలక్ష్మి అలంకారంలో దర్శనమిచ్చారు. ఉదయం ఆలయంలో మహన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం, సహస్రనామార్చన చేశారు. వాకరచర్ల రమేష్, చిన్న సత్యనారాయణ, మల్లికార్జున, చంద్రశేఖర్ ఉభయకర్తలుగా వ్యవహరించారు. అదేవిధంగా నాగేశ్వరస్వామి ఆలయంలోని అమ్మవారు అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. చిట్టేటి పెరుమాల్, గోవిందమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

నాయుడుపేట టౌన్: పట్టణంలోని మూకాంబికాదేవి వీధిలో వెలసిన మూకాంబికాదేవి బాలత్రిపురసుందరిదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. అలాగే పట్టణంలోని మానసాదేవి, పోలేరమ్మ, దుర్గాదేవి, అంకమ్మ, కన్యకా పరమేశ్వరి ఆలయాల్లో అమ్మవారు వివిధ అలంకరణలో దర్శనమిచ్చారు.

గూడూరు: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని పలు ఆలయాల్లో అమ్మవార్లను వివిధ రూపాల్లో అలంకరించారు. స్థానిక సాయి సత్సంగ నిలయంలోని విజయదుర్గాదేవి ఉపపీఠంలో విజయదుర్గాదేవిని గాయత్రిదేవిగా, బజారుకలశం వద్ద అమ్మవారిని ఆదిశక్తిగా, నారాయణమ్మ పేరంటాళ్ల ఆలయంలో అమ్మవారిని గాయత్రిదేవిగా, రాజరాజేశ్వరీదేవిని గాయత్రిదేవిగా, కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా, ధర్మరాజస్వామి ఆలయంలో ద్రౌపదిదేవిని లక్ష్మీదేవిగా, గంగమ్మ ఆలయంలో అమ్మవారిని శ్రీలక్ష్మీదేవిగా అలంకరించారు.

చిల్లకూరు: మండలంలోని తూర్పుకనుపూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మను అన్నపూర్ణాదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. అమ్మవారిని అర్ధరథంపై గ్రామోత్సవం జరిపారు. కలకొండ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఆదిలక్ష్మీదేవిని ఆదిలక్ష్మీదేవిగా అలంరించారు.

డక్కిలి: దేవుని వెల్లంపల్లి స్తంభాలగిరి ఈశ్వరయ్యస్వామి ఆలయంలోని అమ్మవారు పార్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పార్వతీదేవికి భక్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకొన్నారు.

వెంకటగిరి టౌన్: పట్టణంలోని కన్యకా పరమేశ్వరిని పరమేశ్వరిగా అలంకరించారు. మూలవిరాట్‌ను బాదంపప్పుతో, కర్ణకమ్మవీధిలోని కాత్యయనీదేవిని గాయత్రీదేవిగా, వెంకటేశ్వరస్వామిని కూర్మావతారంలో, బంగారుపేటలోని విష్ణుదుర్గాదేవిని గాయత్రీదేవిగా, మందనాంచరేశ్వరిని రాజరాజేశ్వరిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

కోట: గ్రామదేవత కోటమ్మను గాయత్రిదేవిగా, వాసవీ కన్యకా పరమేశ్వరిని రాజరాజేశ్వరిగా అలంకరించారు.



గూడూరు: గాయత్రిదేవి అలంకరణలో విజయదుర్గాదేవి, అన్నపూర్ణాదేవిగా కన్యకాపరమేశ్వరి, ఆదిశక్తిగా బజారుకలశం అమ్మవారు, లక్ష్మీదేవిగా గంగమ్మ - వెంకటగిరి: విష్ణుదుర్గాదేవి, కాత్యయనీదేవిగా గాయత్రీదేవి

ప్రజా సమస్యలను పరిష్కరించలేని పదవులెందుకు?

- ఐదేళ్లలో ఒక్క పనీ చేయలేకపోయాం
- బయటకు వెళ్తే ప్రజలు ప్రశ్నిస్తున్నారు
- సమావేశంలో కౌన్సిలర్ల ఆవేదన



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ దబ్బల శ్రీమంత్ రెడ్డి, పక్కన కమిషనర్ చిన్నయ్య - హాజరైన కౌన్సిలర్లు

సూళ్లూరుపేట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల కౌన్సిలర్లుగా ఉండి, ఒక్క పని కూడా చేయలేకపోయాం... వార్డుల్లో సమస్యలు పరిష్కరించలేని పదవులు మాకేందుకు అంటూ పలువురు కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. అజెండాలోని అంశాలను చర్చిస్తుండగా 9వ వార్డు కౌన్సిలర్ కదూరు లక్ష్మమ్మ జోక్యం చేసుకుంటూ సూళ్లూరు ప్రాంతంలో ఉన్న 6,7,8,9 వార్డుల్లో కనీసం తాగునీరు అందించలేకపోతున్నాం.. కొళాయిలు లేకపోయినా కొళాయి పన్నులు విధిస్తున్నారు... డ్రైన్‌లు, రోడ్లు సరిగా లేవు... ప్రతి సమావేశంలో కౌన్సిలర్లు మొరపెట్టుకుంటున్నా ప్రతిపాదనలు సిద్ధం చేశాం.. టెండర్లు పిలిచాం... అంటూనే ఐదేళ్లు గడిచిపోయింది. ఓట్లు వేసి గెలిపించిన ప్రజల సమస్యలను పరిష్కరించలేని పదవులు మాకెందుకు అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఇదేదో అధికారుల మీద కోపంతోనో.. పాలకవర్గంపై కక్షతోనే చెప్పడం లేదని... కనీసం ఒక్క పనికూడా చేయలేకపోయామన్న బాధతో చెబుతున్నానని అన్నారు. 8, 18 వార్డుల కౌన్సిలర్లు ఈదూరు చెంగమ్మ, జనార్దన్ మాట్లాడుతూ సమస్యలపై ప్రజలు ప్రశ్నిస్తుంటే బయట తిరగలేకపోతున్నామని, మున్సిపల్ అధికారులకు పలుమార్లు చెప్పినా పట్టించుకోవడంలేదని... చిన్నపాటి సమస్యలను కూడా పరిష్కరించలేని స్థితిలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పన్నులు కట్టే ప్రజలకు కనీస సేవలు అందించలేని స్థితిలో మున్సిపాలిటీ ఉందంటే ఎవరి తప్పో మనమే ఆత్మ విమర్శ చేసుకోవాలన్నారు. 14 వార్డు కౌన్సిలర్ బంధిల మహేష్ మాట్లాడుతూ మన్నారుపోలూరు మురికికూపంలా మారిందని, ఎక్కడ చూసిన మురుగునీటితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వైస్‌చైర్మన్ చిన్న సత్యనారాయణ మాట్లాడుతూ బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్స్ చాలా ఆలస్యం చేస్తున్నారని, దీని వల్ల సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కౌన్సిలర్లు తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను పరిష్కరిస్తామని కమిషనర్ చిన్నయ్య హామీ ఇచ్చారు. అజెండాలో పొందుపరిచిన 29 అంశాలపై చర్చించారు. ఒక్క అంశాన్ని తిరస్కరించగా, మిగిలిన వాటికి కౌన్సిల్ ఆమోదం తెలిపింది. సమావేశంలో వైస్ చైర్మన్ పోలూరు పద్మ, టీపీవో బాలసుబ్రహ్మణ్యం, ఆర్‌వో నారాయణరెడ్డి, డీఈ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్ల ఎంపిక

కోట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం ఎన్‌సీసీ క్యాడెట్ల ఎంపిక జరిగింది. ఫిజికల్, రన్నింగ్, మెంటల్, వ్యక్తిత్వ పరీక్షలు నిర్వహించి 27మందిని నావీ ఎన్‌సీసీ క్యాడెట్లుగా ఎంపిక చేశారు. ఎన్‌సీసీ ఆఫీసర్ మల్లికార్జునరెడ్డి, ఇన్‌స్పెక్టర్లు వైకుంఠం, లక్ష్మణ కుమార్ పాల్గొన్నారు.

దాడి కేసులో ఏడుగురికి మూడేళ్ల జైలు

డక్కిలి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): దాడి కేసులో ఏడుగురికి మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ వెంకటగిరి కోర్టు జడ్జి విష్ణువర్మ మంగళవారం తీర్పు ఇచ్చారు. డక్కిలి మండలం డి.ఉప్పరపల్లి గ్రామానికి చెందిన కత్తి మల్లికార్జున, కె.పరుశురాం, వెంకటసుబ్బయ్య, నవీన్, రాజా, అశోక్, రాముడు 2018లో ఉప్పరపల్లి గ్రామంలో జరిగిన తిరునాళ్లలో చేమూరు బానుప్రకాష్ అనే యువకుడిపై దాడిచేసి గాయపరిచారు. విచారణలో నేరం రుజువుకావడంతో నిందితులకు మూడేళ్ల జైలు శిక్షతో పాటు ఒక్కొరికి రూ.6,500 వంతున జరిమాన విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

గూడూరు అర్బన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆస్పత్రి ఎదురుగా ఉన్న డివైడర్‌పై గుర్తుతెలియని వ్యక్తి మృతి చెంది ఉండటాన్ని మంగళవారం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఒకటో పట్టణ పోలీసుల వివరాల మేరకు... స్థానిక ఏరియా ఆస్పత్రి ఎదురుగా ఉన్న డివైడర్‌పై 60ఏళ్లకు పైబడి వయస్సు కలిగిన వ్యక్తి అపస్మారక స్థితిలో పడివుండటాన్ని స్థానికులు గుర్తించి ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే అతను మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడు సిమెంట్ కలర్ చెక్స్ చొక్కా, బులుగురంగు లుంగీ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కారు ఢీకొని ఇద్దరికి గాయాలు

తడ, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): కారు ఢీకొని ఇద్దరికి గాయాలయ్యాయి. మండల పరిధిలోని కారూరు పంచాయతీ బాలకృష్ణాపురం కుప్పం గ్రామానికి చెందిన గుణశేఖర్, సుమన్ బైక్‌పై బీవీపాళెం చెక్‌పోస్టు వద్ద వెళ్లారు. తిరిగి వెళ్తుండగా నెల్లూరు నుంచి చెన్నై వైపు వెళ్తున్న కారు వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో గుణశేఖర్, సుమన్‌కు తీవ్ర గాయాలవడంతో ఎలాఊరు ఆస్పత్రికి తరలించారు.


బైక్‌ను ఢీకొన్న ఆటో: వృద్ధుడి మృతి

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చంద్రబాబు కాలనీ సమీపంలో బైక్‌ను ఆటో ఢీకొన్న ఘటనలో వృద్ధుడి మృతి చెందాడు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన రాము చంద్రబాబు కాలనీలో నివాసం ఉంటూ ఐస్ అమ్ముకుని జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం రాత్రి పట్టణంలో సరుకులు కొనుక్కొని బైక్‌పై ఇంటికి వెళ్తుండగా ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో రాము(60) అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక తరలింపుపై వివాదం

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిగురుపాడు స్వర్ణముఖినది వద్ద ఇసుక తరలింపు విషయంలో మంగళవారం వివాదం చోటుచేసుకుంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనాస్థలికి చేరుకొని ఇరువర్గాలను పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లి విచారిస్తున్నారు.

ఆల్తూరుపాడు నిర్మాణానికి నిధులివ్వండి: కురుగొండ్ల



సీఎం చంద్రబాబుకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

డక్కిలి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): డక్కిలి మండలంలోని ఆల్తూరుపాడు రిజర్వాయరు నిర్మాణానికి నిధులు విడుదల చేయాలని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం అసెంబ్లీ సమావేశాల అనంతరం ఎమ్మెల్యే రామకృష్ణ ముఖ్యమంత్రిని సీఎం చాంబర్‌లో కలిసి నియోజకవర్గ సమస్యలను వివరించారు. ముఖ్యంగా ఆల్తూరుపాడు రిజర్వాయరు నిర్మాణ పనులను గత వైసీపీ ప్రభుత్వం రీటెండరు పేరుతో అడ్డుకోని రైతు ప్రయోజనాలను దెబ్బతీసిందన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక ఆల్తూరుపాడు రిజర్వాయరు నిర్మాణ పనులు మొదలు పెడతామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని చంద్రబాబుకు గుర్తు చేశారు. ఇందుకు సీఎం సానుకూలంగా స్పందించి రూ.630 కోట్లతో ఆల్లూరుపారు రిజర్వాయరు నిర్మాణానికి టెండర్లు పిలిచేందుకు గ్రీన్ సిగ్నెల్ ఇచ్చారని ఎమ్మెల్యే చెప్పారు. అలాగే వెంకటగిరి పట్టణ నడిబొడ్డున ప్రవహించే కైవల్యానదిని అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు అందజేయగా సీఎం సానుకూలంగా స్పందించారని, ఇంకా వెంకటగిరిలో 100 పడకల ఆస్పత్రి, డయాలిసిస్ సెంటరు ఏర్పాటు విషయాన్ని ప్రస్తావించగా దశలవారీగా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని కురుగొండ్ల తెలిపారు.

నేడు జాబ్ మేళా

సూళ్లూరుపేట, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం శ్రీసిటీలోని టీవీఎస్ ఇండోస్ పరిశ్రమ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్ఎల్‌బీ శంకర్ తెలిపారు. 2021-25 మధ్య డిగ్రీ, డిప్లొమా చదివిన మహిళలు అర్హులన్నారు.

తాగునీటి కోసం నిరసన

వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 25వ వార్డులో మూడు రోజులుగా తాగునీరు రావడం లేదంటూ ఖాళీ బిందెలతో మహిళలు మంగళవారం నిరసన తెలిపారు. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని వాపోయారు. రెండు రోజుల్లో సమస్య పరిష్కరించకపోతే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు.

పోషణ్ పక్వాడా

కోట, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెందోడు పంచాయతీ ఎన్టీఆర్ గిరిజన కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ కవిత, ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

నాయుడుపేట, సెప్టెంబరు 23 (ఆంధ్ర జ్యోతి): నాయుడుపేట పట్టణంలో మంగళ వారం చాగణం లలితమ్మ భాస్కర్‌రావు మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో వెంకటేశ్వర అరవింద్ నేత్రాలయ సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 208 మందికి పరీక్షలు నిర్వహించి 75 మందికి మందులు, 50 మందికి కంటి అద్దాలను ఉచితంగా అందజేశారు. 25 మందికి ఉచితంగా ఆపరేషన్లు చేయాలని నిర్ణయించారు.

పాడి రైతులకు శిక్షణ

గూడూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాంతీయ పశువైద్యశాలలో మంగళవారం పాడిరైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ సురేష్ మాట్లాడుతూ పశువుల్లో వచ్చే గర్భకోశ వ్యాధుల నివారణకు ఉచితంగా సేవలందిస్తున్నామని, అదేవిధంగా గాలికుంటువ్యాధి నివారణ ఉచితంగా టీకాలు వేస్తున్నామని, ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుని పాడిరైతులు ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీ గోపీనాయక్, డాక్టర్ రాజేష్, డాక్టర్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.